


- జాతీయ రహదారి పక్కనే ఆక్రమణపర్వం
- సప్లై ఛానళ్లనూ వదలని అక్రమార్కులు



కబ్జాలో కాజూరు చెరువు!



చెరువుకు వచ్చే కాలువ పూడ్చివేత



కాజూరు చెరువు

చిత్తూరు అర్బన్, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రమైన చిత్తూరు నగర శివారులో వున్న కాజూరు చెరువు కబ్జాకు గురవుతోంది.చిత్తూరు-బెంగళూరు జాతీయ రహదారి పక్కనే వున్న కారణంగా ఈ చెరువుపై కబ్జాదారుల కన్ను పడింది.సప్లై ఛానళ్లను కూడా వదలకుండా ఆక్రమిస్తున్నా అధికార యంత్రాంగం పట్టించుకోకపోవడం విమర్శలకు తావిస్తోంది. చిత్తూరు నగరానికి తాగు, సాగునీరందించడానికి గంగినేని , కట్టమంచి , కాజూరు చెరువులుండేవి. వర్షాకాలంలో ఈ మూడు చెరువులు నిండితే నగరానికి తాగునీటితో పాటు కింద భాగంలో ఉన్న రైతుల భూములకు నీళ్లందేవి.అయితే సప్లై ఛానళ్లు దెబ్బతిని చెరువులకు నీళ్లొచ్చే మార్గాలు మూసుకుపోవడంతో చిత్తూరుకు నీటి సమస్య దాపురించింది.రికార్డుల్లో జడియం చెరువుగా, వాడుకలో కాజూరు చెరువుగా పిలిచే ఈ చెరువు సర్వే నెంబరు 159, 170లో సుమారు 200 ఎకరాల వరకు ఉంది. కాజూరు, ఇరువారం, కొండ ప్రాంతం, పోతంబట్టు ప్రాంతాల నుంచి ఏడు సప్లై ఛానళ్లు ఉండేవి. కాలక్రమేణా వీటిలో ఐదు ఛానళ్లను కబ్జాదారులు ఆక్రమించుకోవడంతో బలమైన వర్షం కురిసినా చెరువుకు నీళ్లు రావడం లేదు. అక్కడక్కడా పల్లపు ప్రాంతంలో మాత్రమే నీరు చేరుతోంది.చెరువు రోడ్డును ఆనుకుని ఉండడం.. రోజు రోజుకూ నగరం విస్తరించడంతో కబ్జాదారుల కన్ను కాజూరు చెరువుపై పడింది. తూర్పు భాగంలో ఉన్న కాజూరు కాలనీ వాసులు కూడా అటు వైపు నుంచి చెరువు స్థలంలో కొన్ని నిర్మాణాలు చేపట్టారు. ఇటుపక్క రోడ్డును ఆనుకుని ఉన్న చెరువు భూముల్లో గత వైసీపీ ప్రభుత్వ హయాంలోనే వ్యర్థాలను తోలి నింపి కొద్దికొద్దిగా చదును చేస్తూ వచ్చారు.ఇప్పటికే కబ్జాదారులు ఐదు ఎకరాల వరకు ఆక్రమించి మట్టిని తోలి చదును చేశారు. దాని పక్కనే ఓ వ్యక్తి వాహనాల షెడ్డును ఏర్పాటు చేసుకున్నాడు.ఇక్కడ ఎకరం భూమి ధర రూ. 15 కోట్ల వరకు ఉంటుందని స్థానికులు చెబుతున్నారు. ఈ లెక్కన కబ్జాదారులు ఆక్రమించుకున్న భూముల ధర రూ. 75 కోట్ల వరకు ఉంటుందని సమాచారం.కలెక్టర్ సహా ఉన్నతాధికారులు బంగారుపాళ్యం, పలమనేరు, కుప్పం వెళ్లాలంటే ఈ మార్గంలోనే వెళతారు.అయినా ఈ ఆక్రమణ వారి కంటికి కనపడకపోవడమే విచిత్రం.స్థానిక అధికారులకు కాజూరు చెరువు కబ్జా గురించి తెలిసినా చర్యలు తీసుకోవడం లేదు.

రిజిస్ట్రేషన్ల ఆదాయం తగ్గుముఖం



లక్ష్యం-ప్రగతి (రూ.కోట్లలో)

సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం	ఆదాయ లక్ష్యం	సాధించిన ప్రగతి	రాబడి శాతం	జరిగిన రిజిస్ట్రేషన్లు
బంగారుపాళ్యం	11.73	6.55	55.00	3,446
కుప్పం	25.69	17.96	69.93	11,949
పలమనేరు	33.78	26.34	78.00	10,520
పుంగనూరు	32.76	10.61	59.87	8,974
చిత్తూరు (ఆర్వో)	75.77	51.08	67.41	12,488
కార్వేటినగరం	9.70	7.35	75.71	5,104
నగరి	16.33	10.70	65.52	3,337
చిత్తూరు రూరల్	16.08	10.22	63.54	4,838
మొత్తం	221.88	149.85	68.00	60,656

చిత్తూరు కలెక్టరేట్, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): చిత్తూరు జిల్లావ్యాప్తంగా వున్న సబ్ రిజిస్ట్రార్ (ఎస్ఆర్) కార్యాలయాల ద్వారా వార్షిక ఆదాయం లక్ష్యం దాటలేదు. 2024-25లో రూ.221.88 కోట్ల ఆదాయ లక్ష్యం బదులు మార్చి 31 నాటికి పూర్తయిన ఆర్థిక సంవత్సరాంతంలో రూ.149.88 కోట్లు మాత్రమే ఆదాయం సాధించింది. నిజానికి ప్రభుత్వ ఆదాయ రాబడి సంస్థల్లో స్టాంపులు, రిజిస్ట్రేషన్లశాఖ ఒకటి. కానీ ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యంలో చిత్తూరుజిల్లా రిజిస్ట్రేషన్ శాఖ వెనుకబడింది. 2023-24 సంవత్సరంతో పోలిస్తే 2024-25లో లక్ష్యసాధనలో మెరుగుపడింది. రిజిస్ట్రేషన్లశాఖ చరిత్రలో ఎన్నడూ లేనివిధంగా 2023-24లో 50.90 శాతానికి లక్ష్యం పరిమితం కాగా, 2024-25లో 68శాతానికి పెరిగింది. జిల్లాలో ఎనిమిది సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాలున్నా.. ఏ కార్యాలయం కూడా నిర్దేశించిన ఆదాయలక్ష్యాన్ని చేరుకోలేదు. అత్యధికంగా పలమనేరు ఎస్ఆర్ 78 శాతంతో ముందుండగా, కార్వేటినగరం ఎస్ఆర్ 75.71 శాతం, కుప్పం ఎస్ఆర్ 69.93 శాతంతో ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచాయి. చిట్టచివరి స్థానంలో బంగారుపాళ్యం ఎస్ఆర్ 55.88శాతం మాత్రమే వృద్ధి సాధించింది. ఇదిలావుండగా 2023-24లో 86,622 డాక్యుమెంట్ల రిజిస్ట్రేషన్ కాగా, 2024-25లో 60,656 డాక్యుమెంట్లు రిజిస్ట్రేషన్లు జరిగి సుమారు 26వేల రిజిస్ట్రేషన్లు తగ్గాయి.

రోడ్డు ప్రమాదంలో టీచర్ మృతి



గురుమూర్తి

వి.కోట, ఏప్రిల్ 1(ఆంధ్రజ్యోతి): వి.కోట - పలమనేరు ప్రధాన రహదారిలో రాఘవపల్లె వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో పాకాలకు చెందిన గురుమూర్తి (54) అనే ఉపాధ్యాయుడు మృతి చెందారు.మండల కేంద్రమైన పాకాల సమీపంలోని గుట్టకిందఇండ్లకు చెందిన గురుమూర్తి రామకుప్పం మండలం కంచిదాసనపల్లెలో ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్నారు. వరుస సెలవులుండడంతో స్వగ్రామానికి వెళ్లి మంగళవారం ఉదయం ద్విచక్ర వాహనంపై రామకుప్పానికి వస్తుండగా రాఘవపల్లె వద్ద రోడ్డు ప్రమాదానికి గురయ్యారు. గాయాలతో కిందపడి ఉన్న ఆయన్ను స్థానికులు అంబులెన్స్ ద్వారా వి.కోట ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అక్కడ పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతి చెందినట్లు చెప్పడంతో ఆస్పత్రి వద్దకు చేరుకున్న సహచర ఉపాధ్యాయులు ఆయన కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. సీఐ సోమశేఖర్‌రెడ్డి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పశువుల దాహార్తి తీర్చేందుకు...



చిత్తూరు సెంట్రల్, ఏప్రిల్ 1(ఆంధ్రజ్యోతి):వేసవి కాలంలో జిల్లాలో పాడిపశువులకు తాగునీటి ఇబ్బందులు లేకుండా డ్వామా ఆధ్వర్యంలో నీటి తొట్టెల నిర్మాణాలను జిల్లాలో పలు చోట్ల మంగళవారం ప్రారంభించారు. పలమనేరు ఎమ్మెల్యే అమరనాథరెడ్డి గంగవరం మండలం కీలపట్లలో, జీడీ నెల్లూరు ఎమ్మెల్యే కార్వేటినగరం మండలం సురేంద్రనగరం కాలనీలో ఎమ్మెల్యే థామస్, రొంపిచెర్ల మండలం పెద్దగొట్టిగల్లు పంచాయతీ గెర్లపల్లెలో తొట్టెల నిర్మాణాలకు ప్రారంభోత్సవం చేశారు.అలాగే బంగారు పాళ్యం,పాలసముద్రం, గుడిపాల తదితర మండలాల్లో కూడా నీటి తొట్టెల నిర్మాణాలను ప్రారంభించారు.ఈ సందర్భంగా డ్వామా పీడీ రవికుమార్ మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో ఆవులకు, గొర్రెలకు, మేకలకు తాగునీటిని అందించాలనే లక్ష్యంతో ఈ తొట్టెలు నిర్మాణం చేపడుతున్నామన్నారు. జిల్లావ్యాప్తంగా 939తొట్టెలు మంజూరు కాగా, 895తొట్టెలకు అనుమతులు వచ్చాయన్నారు.

గంగవరం మండలం జేఆర్ కొత్తపల్లెలో నీటితొట్టె పనులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే అమరనాథరెడ్డి

డైట్‌లో అధ్యాపకులకు దరఖాస్తుల ఆహ్వానం

వెదురుకుప్పం, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): కార్వేటినగరంలోని జిల్లా విద్యా శిక్షణ సంస్థ(డైట్)లో డిప్యుటేషన్‌పై అధ్యాపకులుగా పనిచేయడానికి అర్హులైన వారినుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ శేఖర్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రభుత్వ, జిల్లా పరిషత్, మున్సిపల్, మేనేజ్‌మెంట్ పాఠశాలల్లో పని చేస్తున్నవారు దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఈ ఏడాది మార్చి నెలాఖరుకు 58 ఏళ్లలోపు ఉన్నవారే అర్హులన్నారు. ఇతర వివరాలకు డైట్‌లో సంప్రదించాలని సూచించారు.

రేషన్ సరుకుల పంపిణీ ప్రారంభం

- ఈ నెలా కందిపప్పు లేనట్లే..!

చిత్తూరు కలెక్టరేట్, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): కార్డుదారులకు నిత్యావసర వస్తువుల పంపిణీ మంగళవారం నుంచి ఎండీయూ వాహనాల ద్వారా ప్రారంభమైంది. ఎనిమిది వేల టన్నుల బియ్యం 5,34,262 కార్డుదారులకు పంపిణీకి అవసరం కాగా, సోమవారం వరకు 7633 టన్నుల బియ్యం, పంచదార 250 టన్నులు అందాయి. కాగా, రెండు నెలలుగా బియ్యం, పంచదార తప్ప మిగిలినవి పంపిణీ చేయలేదు. ఏప్రిల్ నెలలోనైనా కందిపప్పు అందవచ్చని ఆశలో ఉండిన కార్డుదారులకు నిరాశే ఎదురు కానుంది.

రిజిస్ట్రేషన్ స్లాట్ బుకింగ్ వాయిదా

చిత్తూరు కలెక్టరేట్, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): ఆస్తుల రిజిస్ట్రేషన్‌కు సంబంధించి బుధవారం నుంచి చిత్తూరు ఆర్వో కార్యాలయంలో ప్రారంభం కావాల్సిన స్లాట్ బుకింగ్ కొత్త విధానం వాయిదా పడిందని జిల్లా రిజిస్ట్రార్ వెంకటరమణ మూర్తి తెలిపారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ.. నూతన విధానం ప్రవేశపెట్టే తదుపరి తేదీని ప్రకటించనున్నట్లు ప్రభుత్వం నుంచి ఆదేశాలు అందడంతో వాయిదా వేసినట్లు చెప్పారు.

తగ్గిన ఉష్ణోగ్రతలు




చిత్తూరు కలెక్టరేట్, ఏప్రిల్ 1 (ఆంధ్రజోతి): పగటి ఉష్ణోగతలు మంగళవారం తగ్గాయి. 40 డిగ్రీల వరకు పలు మండలాల్లో ఇటీవల నమోదవుతుండగా, మంగళవారం 37 డిగ్రీలకే పరిమితమయ్యాయి. అత్యధికంగా తవణంపల్లెలో 37.2, నగరిలో 37, అత్యల్పంగా కుప్పంలో 31.6 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. మండలాలవారీగా శ్రీరంగరాజపురంలో 36.7డిగ్రీలు, పులిచెర్ల, వెదురుకుప్పం మండలాల్లో 36.5, చిత్తూరు, గుడిపాల మండలాల్లో 36.4, పూతలపట్టులో 36.3, బంగారుపాళ్యంలో 35.6, సదుంలో 35.3, నింద్రలో 35, చౌడేపల్లె, ఐరాల, యాదమరి,పాలసముద్రం, పెనుమూరు, విజయపురం మండలాల్లో 34.5, సోమలలో 34.3, గంగాధరనెల్లూరులో 34.2, కార్వేటినగరం, పెద్దపంజాణి మండలాల్లో 34, గంగవరం, రొంపిచెర్ల, వి.కోట మండలాల్లో 33.3, రామకుప్పంలో 33, బైరెడ్డిపల్లిలో 32.8, గుడుపల్లిలో 32.3, పలమనేరులో 32.3, శాంతిపురంలో 32.3, పుంగనూరులో 31.8 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి.

జిల్లా గ్రంథాలయ సంస్థ పర్సన్ ఇన్‌చార్జిగా జేసీ

చిత్తూరు రూరల్, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): జిల్లా గ్రంథాలయ సంస్థ వ్యవహారాల నిర్వహణకు జాయింట్ కలెక్టర్ విద్యాధరిని పర్సన్ ఇన్‌చార్జిగా నియమిస్తూ గవర్నర్ మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఆరు నెలలు లేదా కొత్త గ్రంథాలయ సంస్థ చైర్మన్ నియమించే వరకు బాధ్యతలు నిర్వహించాలని ఆ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

డీసీహెచ్ఎస్‌గా పద్మాంజలిదేవి



చిత్తూరు రూరల్, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): చిత్తూరు డీసీహెచ్ఎస్‌గా పద్మాంజలిదేవిని నియమిస్తూ మంగళవారం ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఏడాది కిందట డీసీహెచ్ఎస్‌గా ఉండిన బీసీకే నాయక్‌ను అప్పటి కలెక్టర్ ప్రభుత్వానికి సరెండర్ చేశారు. ఆ స్థానంలో ఆరోగ్యశ్రీ జిల్లా కోఆర్డినేటర్‌గా ఉన్న రాజశేఖర్‌రెడ్డికి ఇన్‌చార్జి బాధ్యతలు అప్పగించారు. కూటమి ప్రభుత్వం వచ్చాక ఆయన స్థానంలో నగరి ఏరియా ఆస్పత్రి సూపరింటెండెంట్ ప్రభావతికి బాధ్యతలు అప్పగించారు. మంగళవారం ప్రభుత్వం రాష్ట్రవ్యాప్తంగా పలువురికి ఉద్యోగోన్నతులు కల్పిస్తూ ఉత్తర్వులు జారీచేసింది. అందులో పుంగనూరు ఏరియా ఆస్పత్రి సూపరింటెండెంట్‌గా పని చేస్తున్న పద్మాంజలిదేవిని చిత్తూరు డీసీహెచ్ఎస్‌గా నియమించారు. దీంతో ప్రస్తుతం డీసీహెచ్ఎస్‌గా ఉన్న ప్రభావతి గతంలో పనిచేస్తున్న నగరి ఏరియా ఆస్పత్రి సూపరింటెండెంట్‌గా కొనసాగనున్నారు.పదోన్నతి లభించడంపై పద్మాంజలిదేవి స్పందిస్తూ ప్రభుత్వ వైద్యశాలల్లో ప్రజలకు మెరుగైన సేవలు అందించేందుకు కృషి చేస్తానని తెలిపారు.

తొలి రోజే 96.31 శాతం పింఛన్ల పంపిణీ



కార్వేటినగరం మండలం సురేంద్రనగరం ఏఏడబ్ల్యూలో పింఛను సొమ్ము అందిస్తున్న ఎమ్మెల్యే థామస్

చిత్తూరు సెంట్రల్, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీలో భాగంగా తొలి రోజున మంగళవారం 96.31శాతం పంపిణీ జరిగింది. 2,64,275 మందికి గాను 2,54,511 మందికి గ్రామ, వార్డు సచివాలయ సిబ్బంది ఇళ్ల వద్దకు వెళ్లి పింఛను సొమ్ము అందజేశారు. వివిధ కారణాలతో మిగిలిన లబ్ధిదారులకు ఈనెల ఐదవ తేదీలోపు పంపిణీ చేయనున్నట్లు డీఆర్‌డీఏ అధికారులు తెలిపారు.

ముగిసిన టెన్త్ పరీక్షలు

చిత్తూరు సెంట్రల్, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో గత నెల 17వ తేదీన ప్రారంభమైన పదో తరగతి పరీక్షలు మంగళవారంతో ముగిశాయి. చివరి రోజు జరిగిన సాంఘిక శాస్త్రం పరీక్షకు రెగ్యులర్, ప్రైవేటు విద్యార్థులు 20,893 మందికి 20,702 మంది హాజరవగా 191 మంది గైర్హాజరైనట్లు డీఈవో వరలక్ష్మి తెలిపారు. డీఈవో, పరీక్షల సహాయ కమిషనర్ రెండు కేంద్రాలు, ఎనిమిది ఫ్లయింగ్ స్క్వాడ్లు 31 కేంద్రాలను పరిశీలించగా, 57 కేంద్రాల్లో సిట్టింగ్ స్క్వాడ్ బృందాలు విధులు నిర్వహించినట్లు డీఈవో పేర్కొన్నారు. కాగా, పరీక్షల్లో ఐదుగురు ఇన్విజిలేటర్లను విధుల నుంచి తొలగించగా, 15 కేంద్రాల్లో ఇన్విజిలేటర్లను మార్పు చేశారు. ఒక్క విద్యార్థి మాత్రమే డీబార్ అయ్యారు.

రెండో ఉచిత సిలిండర్ బుకింగ్స్ ప్రారంభం

చిత్తూరు కలెక్టరేట్, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): ఎన్నికల్లో ఇచ్చిన హామీమేరకు ప్రభుత్వం అర్హులకు ఏటా మూడు వంట గ్యాస్ సిలిండర్లు ఉచితంగా అందించేందుకు దీపం-2 పథకాన్ని అమలు చేస్తోంది. మార్చి 31వ తేదీతో మొదటి విడత గడువు పూర్తయ్యింది. మంగళవారం నుంచి రెండో విడత ఉచిత సిలిండర్ పంపిణీ ప్రారంభమయ్యింది. ప్రతి నాలుగు నెలలకు ఒక సిలిండర్ ఉచితంగా ఇచ్చేలా ప్రభుత్వం కార్యాచరణ అమలు చేస్తోంది. సిలిండరును నగదు చెల్లించి తీసుకున్న 48 గంటల్లోనే వినియోగదారుడి ఖాతాలోకి ఆ మొత్తాన్ని రాష్ట్ర ప్రభుత్వం జమ చేస్తుంది.



చికిత్స పొందుతున్న క్షతగాత్రులు





మొదటిఘాట్‌లో అదుపుతప్పిన టీటీడీ టెంపో

● ఐదుగురికి గాయాలు

తిరుమల, మార్చి1(ఆంధ్రజ్యోతి): తిరుమల మొదటిఘాట్ రోడ్డులో మంగళవారం టీటీడీకి చెందిన టెంపో వాహనం అదుపుతప్పి పిట్టగోడను ఢీకొంది. దీంతో ఐదుగురికి గాయాలయ్యాయి. తిరుమలలో అనధికారికంగా ఉంటున్న వ్యక్తులను వారం రోజులుగా విజిలెన్స్, పోలీసులు గుర్తించి తిరుపతికి తరలిస్తున్న విషయం తెలిసిందే. ఈక్రమంలోనే మంగళవారం కూడా 22 మందిని గుర్తించారు. వీరిని డ్రైవర్ చేసేందుకు టెంపో వాహనంలో తిరుమల నుంచి తిరుపతికి తరలిస్తుండగా మార్గంలోని చివరి మలుపు వద్ద వాహనం అదుపుతప్పింది. పిట్టగోడను ఢీకొంది. ఈప్రమాదంలో ఐదుగురు భక్తులకు గాయాలయ్యాయి. క్షతగాత్రులను రుయా ఆస్పత్రికి తరలించి వైద్యం చేశారు. వాహనంలో 14 మంది మాత్రమే ఉన్నారని, మిగిలిన వారు ఆర్టీసీ బస్సులో వెళ్లారని పోలీసులు చెబుతున్నా నిబంధనలకు విరుద్ధంగా 22 మందిని ఎక్కించినట్టు తెలుస్తోంది.


సర్వదర్శనానికి 12 గంటలు

తిరుమల వేంకటేశ్వరస్వామి దర్శనానికి 12 గంటల సమయం పడుతోంది. మంగళవారం సాయంత్రం 5 గంటల వరకు ఉన్న సమాచారం మేరకు వైకుంఠం క్యూకాంప్లెక్స్2లోని కంపార్టుమెంట్లు, నారాయణగిరిలో 2 షెడ్లలో సర్వదర్శన భక్తులు, వైకుంఠం క్యూకాంప్లెక్స్1లో 5 కంపార్టుమెంట్లలో టైంస్లాట్ భక్తులు వేచిఉన్నారు.

ఆదివారం హుండీ ఆదాయం: రూ.3.04 కోట్లు

సోమవారం శ్రీవారిని దర్శించుకున్న భక్తులు: 73,007


తలనీలాలు సమర్పించినవారు: 27,440



ఇంటర్‌లో సంస్కరణలకు నాంది

విద్యార్థి జీవితంలో ఇంటర్మీడియట్ ఓ కీలకమలుపు. మ్యాథమేటిక్స్ కోర్సులవైపు వెళ్లాలా... లేక సైన్స్ కోర్సుల్లో చేరాలా అనే విషయాన్ని నిర్ధారించుకునే తరుణమిదే. ఈ దశలో ఎంపిక చేసుకున్న గ్రూప్ భవిష్యత్తును ప్రభావితం చేస్తుంది. ఆసక్తి ఉన్న అంశాన్నే ఎంపిక చేసుకోవాలని విద్యారంగ నిపుణులు సూచిస్తున్నారు. మ్యాథ్స్ కోర్సులకు ఎంపీసీ, సైన్స్ కోర్సులకు బైపీసీ తీసుకుంటారు. ఈ రెండూ చదవాలనుకుంటే ఇప్పటివరకూ కుదరని పరిస్థితి. కానీ తాజాగా రెండు గ్రూపులూ చదివేందుకు ప్రభుత్వం అవకాశం కల్పించింది. అంతేకాదు ముఖ్యమైన ఇంటర్మీడియెట్ విషయంలో కొన్ని మేలైన సంస్కరణలకు శ్రీకారం చుట్టింది.

- చిత్తూరు సెంట్రల్, ఆంధ్రజ్యోతి



కొత్తగా ఎంబైపీసీ

వచ్చే విద్యా సంవత్సరం నుంచి ఎంబైపీసీ గ్రూపు అందుబాటులోకి రానుంది. ఆరు సబ్జెక్టులతో ఎంబైపీసీ చదవచ్చు. లాంగ్వేజి సబ్జెక్ట్ ఇంగ్లిష్ తప్పనిసరి. తరువాత సెంకడ్ లాగ్వేజీ ఆప్షనల్‌గా ఎంచుకోవచ్చు. ఇవికాకుండా గణితం, బయాలజీ, ఫిజిక్స్ కెమెస్ట్రీ సబ్జెక్టులు ఈ గ్రూప్‌లో ఉంటాయి. ఎంపీసీ విద్యార్థులు సెకండ్ లాంగ్వేజ్‌గా హిందీ, సంస్కృతం, ఉర్దూ కాకుండా బయాలజీ తీసుకుని ఎంబైపీసీ చదవవచ్చు. బైపీసీ విద్యార్థులు గణితాన్ని తీసుకుని ఎంబైపీసీ గ్రూపు చదవవచ్చు. ఎంబైపీసీ తీసుకున్న విద్యార్థులకు అవకాశాలు విస్తృతమతుతాయి. వీరు ఇటు మెడిసిన్, అటు ఇంజినీరింగ్ కోర్సుల ప్రవేశ పరీక్షలు రాసే అవకాశం ఉంటుంది. ఈ క్రమంలో ఎంబైపీసీ గ్రూపునకు మంచి స్పందన లభించనుంది.

జిల్లాలో ప్రభుత్వ జూనియర్ కాలేజీలు: 29
ప్రైవేట్ : 59 - హైస్కూల్ ప్లస్: 24
ఒకేషనల్ : 7- కేజీబీవీ :8 - రెసిడెన్షియల్ :1
మోడల్ స్కూల్స్7 - సాంఘిక సంక్షేమ : 4

- ఈఏడాది నుంచి కొత్తగా ఎంబైపీసీ గ్రూప్
- మెడిసిన్, ఇంజనీరింగ్‌లో చేరికకు అవకాశం
- గణితం, బోటనీ, జువాలజీ కలిపి బయాలజీ
- ఎన్‌సీఈఆర్‌టీ సిలబస్‌కు శ్రీకారం

ఇప్పటివరకూ ఇంటర్మీడియెట్‌లో ఆరు సబ్జెక్టుల విధానం ఉంది. సైన్స్ గ్రూపుల్లో రెండు భాషా సబ్జెక్టులు, నాలుగు కోర్ సబ్జెక్టులు, ఆర్ట్స్‌లో రెండు భాష, మూడు కోర్ సబ్జెక్టులు ఉన్నాయి. ఇకపై ఐదు సబ్జెక్టుల విధానం అమల్లోకి రానుంది. ప్రస్తుతం ఎంపీసీలో గణితం ఏ, బీ పేపర్లుగా ఉంది. దీనిని ఒకే సబ్జెక్ట్‌గా మార్చింది. బైపీసీలో బోటనీ, జువాలజీ సబ్జెక్టులను కలిపి బయాలజీగా చేసింది. దీనివల్ల సైన్స్ గ్రూపుల్లో కోర్ సబ్జెక్టులు ఐదు నుంచి నాలుగుకు తగ్గాయి. ఎంపీసీలో గణితం, ఫిజిక్స్, కెమిస్ట్రీ, ఇంగ్లిష్ తప్పనిసరిగా ఉంటాయి. మరో సబ్జెక్ట్‌గా తెలుగు, సంస్కృతాన్ని ఐచ్ఛికంగా తీసుకోవచ్చు. బైపీసీలో ఫిజిక్స్, కెమిస్ట్రీ, బయాలజీ, ఇంగ్లిష్‌తోపాటు ఒక ఎంపిక సబ్జెక్ట్ ఉంటుంది. ఆర్ట్స్ గ్రూప్‌లో కూడా గణితం, బయాలజీలను ఆప్షనల్‌గా తీసుకోవచ్చు. 6వ సబ్జెక్టును ఆప్షనల్‌గా ఎంచుకునే అవకాశం లేదు. రెండో స్థానంలోని లాంగ్వేజ్ సబ్జెక్టును మాత్రమే ఎంచుకునే అవకాశం ఉంటుంది.

ఎన్‌సీఈఆర్టీ సిలబస్

ఇంటర్‌లో వచ్చే విద్యా సంవత్సరం నుంచి ఎన్‌సీఈఆర్టీ సిలబస్‌ను ప్రవేశ పెట్టనున్నారు. ఈ ఏడాది పదవ తరగతి విద్యార్థులకు ఎన్‌సీఈఆర్టీ సిలబస్ బోధించినందున ఇంటర్ మొదటి సంవత్సరంలోనూ ఈ సిలబస్‌ను ప్రారంభించనున్నారు. రెండో సంవత్సర విద్యార్థులకు పాత విధానమే కొనసాగనుంది. పరీక్షల నిర్వహణ, ప్రశ్నపత్రాలు, తరగతుల నిర్వహణ విధానాలను సీబీఎస్ఈ విధానంలోకి మార్చారు. ఆమేరకు ఏప్రిల్ 1 నుంచి ఇంటర్ తరగతులు ప్రారంభం కానున్నాయి. 7వ తేదీ వరకు కొత్త సిలబస్‌పై ఓరియంటేషన్ తరగతులు జరుగనున్నాయి. 7 నుంచి ప్రథమ సంవత్సర ప్రవేశాలకు దరఖాస్తుల ప్రక్రియ ప్రారంభం కానుంది. 24 నుంచి జూన్ 1 వరకు వేసవి సెలవులిస్తారు. జూన్ 2వ తేదీన కళాశాలలు పునఃప్రారంభం కానున్నాయి. సీబీఎస్ఈ సిలబస్ పుస్తకాలతోపాటు నోట్‌పుస్తకాలు, రికార్డు షీట్లను ప్రభుత్వమే ఉచితంగా విద్యార్థులకు అందించనుంది.





రేపటి మన సమాజ భవిష్యత్తు అయిన చిన్నారుల్లో పుస్తకాభిలాష తగ్గుతూ ఉంది. పిల్లల్లో పుస్తక పఠనాసక్తి పెంచితే సామాజిక బాధ్యత, నైతిక విలువలు అలవడతాయంటున్నారు వ్యక్తిత్వ వికాస నిపుణులు, ఉపాధ్యాయులు, సాహిత్యవేత్తలు. నేడు అంతర్జాతీయ బాలల పుస్తక దినోత్సవం సందర్భంగా కథనం.

పుస్తకం చదివితే ప్రపంచ విజ్ఞానం

● నేడు అంతర్జాతీయ బాలల పుస్తక దినోత్సవం

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): సెల్‌ఫోను, కంప్యూటర్ ద్వారా నిత్యం యూట్యూబ్, వాట్సప్, ఫేస్‌బుక్‌లో గడిపే ఈ తరానికి పుస్తక పఠనాసక్తి తగ్గింది. దీనివల్ల చిన్నారులకు నిజమైన ప్రాపంచిక జ్ఞానం అందడం లేదు. దీంతో సామాజిక బాధ్యత, నైతిక విలువలు పెంపొందడం లేదు. ఒకనాడు ఊరిలో, ఇంట్లో పుస్తకాలు, కళల ద్వారా విజ్ఞానం అందేది. గుడిలో భజన, కోలాటం, చెక్క భజన, మహాభారతం వంటి కళా రూపాల ద్వారా ఎన్నో విలువలు అందేవి. పత్రికల ద్వారా.. బొమ్మల ద్వారా.. చిన్నారులకు విలువలు తెలియచేసే అవకాశం ఉండేది. ఇక, వేమన పద్యాలు, సుమతీ శతకం, బేతాళ కథలు వంటి పుస్తకాలు గొప్ప విజ్ఞానాన్ని అందించేవి. క్రమేణా చిన్నారుల్లో పుస్తకాల పట్ల అభిలాష తగ్గుతూ ఉంది. ఇందువల్ల చిన్నారుల్లో ఆత్మనూన్యత, మానసికంగా కుంగిపోవడం, అభద్రతా భావం, మానసిక వ్యధ పెరుగుతోంది. ఇటువంటి భావ దారిద్ర్యానికి మూల కారణం పుస్తక పఠనం లేకపోవడమేనని వ్యక్తిత్వ వికాస నిపుణులు, సాహిత్యవేత్తలు అంటున్నారు. చిన్నారుల్లో పుస్తక పఠనం పట్ల అభిలాష పెంచాలని కోరుతున్నారు. తద్వారా నైతిక విలువలు, సామాజిక బాధ్యత అలవడతాయని అంటున్నారు. ఈ దిశగా తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు మార్గనిర్దేశం చేయాలని సూచిస్తున్నారు.

పుస్తకాలు చదవడంతోనే వ్యక్తిత్వ వికాసం



మంచి పౌరులుగా పిల్లలు ఎదగాలంటే పుస్తకాలు తప్పక చదవాలి. దీనికి తోడు సంగీతం, సాహిత్యం కూడా తెలుసుకోవాలి. మంచి పుస్తకాలే గొప్ప నేస్తాలు. మంచి పుస్తకాలను పిల్లలతో చదివించే వారు గొప్ప తల్లిదండ్రులు. పిల్లలను పుస్తకాల దగ్గరకు తీసుకెళ్లే వారు ఇంకా గొప్ప తల్లిదండ్రులు, గురువులు. పిల్లలు మంచి పుస్తకాలు చదవడం ద్వారా వ్యక్తిత్వ వికాసం కలుగుతుంది.

- కోట పురుషోత్తం, వ్యక్తిత్వ వికాస నిపుణుడు

పుస్తక పఠనంతో సృజనాత్మకత



పుస్తకం చదివితే వ్యక్తిత్వ వికాసం పెరుగుతుంది. సృజనాత్మకత ఏర్పడుతుంది. ఇందువల్ల తొలి మొగ్గలు (కవిత్వం), పసిడి మొగ్గలు (కథలు), బాల కథా నిధి, కర దీపిక (మహనీయుల గాథలు) వంటి పుస్తకాలు తెచ్చాం. ఇలా రాబోయే తరానికి విలువలు అందించాలని ప్రయత్నిస్తున్నా. పాఠశాల స్థాయిలో పుస్తకం.. పద్యం.. కవితా పఠనంచేస్తే ఫలితాలు సాధించవచ్చు.

- డాక్టర్ నెమిలేటి కిట్టన్న, తెలుగు ఉపాధ్యాయుడు, మంగళం ట్రెండ్స్ స్కూల్

ఎర్రచందనం కేసులో నిందితుడికి ఐదేళ్ల జైలు

● రూ.మూడు లక్షల జరిమానా

తిరుపతి(నేరవిభాగం), ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): ఎర్రచందనం స్మగ్లింగ్ కేసులో నిందితుడికి ఐదేళ్ల కఠిన కారాగార శిక్షతో పాటు రూ.మూడు లక్షలు జరిమానా విధిస్తూ ఎర్రచందనం ప్రత్యేక న్యాయస్థానం న్యాయమూర్తి నరసింహమూర్తి మంగళవారం తీర్పు చెప్పారు. అటవీశాఖ లైజన్ అధికారి చంద్రశేఖర రాజు తెలిపిన ప్రకారం.. చిత్తూరుకు చెందిన సత్య మోహన్, మరికొందరు కలిసి కొన్నేళ్లుగా శేషాచలం అడవుల్లో నుంచి ఎర్రచందనం దుంగలను తమిళనాడుకు అక్రమంగా తరలిస్తున్నారు. 2019లో రాయచోటి అటవీ శాఖ రేంజ్ పరిధిలోని సరస్వతి పల్లి బీట్‌లో 39 కిలోల ఎర్రచందనం దుంగలు తమిళనాడుకు తరలించడానికి సిద్ధం చేశారు. ఈ విషయం తెలిసి అప్పటి అటవీశాఖ బీట్ అధికారి భరణికుమార్, సెక్షన్ అధికారి శ్రీరాములు అక్కడికి వెళ్లి వాహనం సహా దుంగలు పట్టుకున్నారు. నిందితుల్లో ఒకడైన సత్యమోహన్‌ను అరెస్టు చేయడానికి సిద్ధపడగా, అధికారుల ఎదుటే అతడు బ్లేడుతో ఆత్మహత్యకు యత్నించాడు. దీంతో ఎర్రచందనం అక్రమ రవాణాతో పాటు ఆత్మహత్యాయత్నంపైనా కేసు నమోదు చేశారు. ఈ కేసును తిరుపతి ఎర్రచందనం కోర్టులో దాఖలు చేశారు. స్పెషల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ బాలకృష్ణమ నాయుడు ప్రభుత్వం తరపున వాదించారు. నిందితుడికి శిక్ష పడేలా అటవీ శాఖ బీట్ అధికారి ఎం.వెంకటేశ్వర్లు, లైజన్ అధికారి చంద్రశేఖర రాజు,కోర్టు కానిస్టేబుల్ కొండయ్య తగిన సాక్ష్యాదారాలను తీసుకొచ్చారు. ఈ క్రమంలో ఇరు వర్గాల వాదనలు విన్నాక నిందితుడు సత్యమోహన్‌కు ఐదేళ్ల కఠిన కారాగార శిక్ష, రూ మూడు లక్షల జరిమానా విధిస్తూ న్యాయమూర్తి నరసంహమూర్తి తీర్పు చెప్పారు. ఎర్రచందనం అక్రమ రవాణాకు పాల్పడే ఎవరినీ వదిలిపెట్టేది లేదని, శిక్షలు కఠినంగా ఉంటాయని బీట్ అధికారి వెంకటేశ్వర్లు తెలిపారు. త్వరలో డ్రోన్లతోనూ నిఘా పెడతామన్నారు.





గ్రామస్తులను విచారిస్తున్న పోలీసులు, గాయపడ్డ భూపతిరెడ్డి

కత్తులతో దాడి: ఒకరికి తీవ్రగాయాలు

● రేకలచేనులో పోలీసు పికెట్

రామచంద్రాపురం, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): కత్తులతో దాడి చేసిన ఘటనలో ఒకరు గాయపడిన సంఘటన రామచంద్రాపురం మండలం అనుపల్లి పంచాయతీ రేకలచేనులో ఉద్రిక్తతకు దారి తీసింది. గ్రామస్థులు, పోలీసుల కథనం మేరకు.. గ్రామంలోని వినాయకస్వామి ఆలయం వద్ద గత శనివారం రాత్రి 11 గంటల వరకు కొందరు భజన చేశారు. గ్రామానికి చెందిన లీలాప్రకాష్‌రెడ్డి వచ్చి తన నాలుగు నెలల పాప నిద్రపోవడం లేదంటూ మైక్ ఆపాలని కోరారు. దీంతో కొంతసేపు ఆపి మళ్లీ మైక్ సౌండ్ బిగ్గరగా పెట్టి భజన చేశారు. దీంతో భజన చేసేవారితో లీలాప్రకాష్‌రెడ్డి వాగ్వాదానికి దిగారు. మైక్ తీసుకెళ్లారు. ఈ ఘటనను భూపతిరెడ్డి వీడియో తీసి తన మిత్రుడు రాజశేఖర్‌రెడ్డికి పంపారు. లీలాప్రకాష్‌రెడ్డి హిందువులను భజన చేసుకోనీయడం లేదంటూ రాజశేఖర్‌రెడ్డి ఆ వీడియోను సోషల్ మీడియాలో పోస్టు చేశారు. దీంతో వారిద్దరిపై ఆదివారం లీలాప్రకాష్‌రెడ్డి పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ నేపథ్యంలో భూపతిరెడ్డి సోమవారం రాత్రి ఇంట్లో నిద్రిస్తుండగా గుర్తు తెలియని వ్యక్తులు వచ్చి కడుపు, గొంతుపై కత్తితో దాడి చేశారు. గాయపడిన భూపతిరెడ్డి గట్టిగా కేకలు వేయడంతో వారు వెళ్లిపోయారు. గ్రామస్తులు భూపతిరెడ్డిని 108 వాహనంలో తిరుపతి రుయాకు తరలించారు. ట్రైనీ ఐపీఎస్ హేమంత్, డీఎస్పీ ప్రసాద్, సీఐ సుబ్బరామిరెడ్డి, ఇన్‌ఛార్జి ఎస్ఐ రవీంద్రనాథ్ మంగళవారం ఉదయం రేకలచేను చేరుకుని గ్రామస్తులను విచారించారు. ఇదే గ్రామంలో 30 ఏళ్ల వ్యవధిలో రాజకీయ ప్రతీకార హత్యలు జరిగాయి. వెంకటరెడ్డి, నారాయణరెడ్డి, నాగిరెడ్డి అనే వ్యక్తులు హత్యకు గురయ్యారు. ప్రస్తుతం గాయపడిన భూపతిరెడ్డి నాగిరెడ్డి కుమారుడు. ఈ క్రమంలో ఎలాంటి ఘటనలు చోటు చేసుకోకుండా పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. స్థానికుల్లో ఆందోళన నెలకొంది.

రాయితీపై బిందు సేద్య పరికరాలు

తిరుపతి(ఎంఆర్‌పల్లె), ఏప్రిల్ 1(ఆంధ్రజ్యోతి): రాయితీపై బిందు సేద్యంపరికరాలు పొందవచ్చని జిల్లా సూక్ష్మనీటిపారుదల అధికారి సతీష్ తెలిపారు. ఐదు ఎకరాల లోపు ఉన్న సన్న, చిన్నకారు రైతులకు 90శాతం రాయితీ ఇస్తామన్నారు. 5 నుంచి 10 ఎకరాలున్న వారికి 70శాతం రాయితీ ఇస్తామన్నారు. ఐదు ఎకరాలున్న సన్నచిన్నకారు రైతులకు స్ప్రింకర్ పరికరాలపై 55శాతం, 5నుంచి పది ఎకరాలుంటే 45 శాతం రాయితీ పొందవచ్చునన్నారు. డ్రిప్, స్ప్రింకర్లు కావాల్సిన రైతులు ఆధార్‌కార్డు, తహసీల్దారు ధ్రువీకరించిన భూమి యాజమాన్యపత్రం లేదా 1బీ రికార్డుతో రైతు సేవా కేంద్రాల్లో బయోమెట్రిక్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలన్నారు. మరిన్ని వివరాలకు సమీపంలోని రైతు సేవా కేంద్రాలను సంప్రదించాలని ఆయన వివరించారు.

వెదురుసాగు పై రాయితీ

తిరుపతి(ఎంఆర్‌పల్లె), ఏప్రిల్ 1(ఆంధ్రజ్యోతి): జిల్లాలో వెదురు సాగు ప్రోత్సాహానికి రాయితీలు ఇస్తున్నట్లు జిల్లా ఉద్యానశాఖాధికారి దశరథరామిరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ప్రైవేటు రంగంలో సాగు చేసేవారికి 50శాతం రాయితీ ఇస్తామన్నారు. ప్రభుత్వ రంగానికి వందశాతం సబ్సిడీ ఉంటుందన్నారు. నర్సరీ అభివృద్ధికిగాను ప్రైవేటు రంగానికి 50శాతం, ప్రభుత్వ రంగానికి వందశాతం రాయితీ ఉంటుందన్నారు. సీజనింగ్ ప్లాంట్, వెదురు డిపోలు, గోదాములు, ప్రాసెసింగ్ యూనిట్లకు ప్రభుత్వ రంగంలో వందశాతం, ప్రైవేటు రంగంలో 50శాతంరాయితీ ఇస్తున్నట్లు పేర్కొన్నారు.

తిరుమలలో తమిళనాడువాసి మృతి

తిరుమల, ఏప్రిల్1(ఆంధ్రజ్యోతి): తమిళనాడుకు చెందిన ఓ యువకుడు మంగళవారం తిరుమలలో మృతి చెందాడు. వన్‌టౌన్ పోలీసుల వివరాల మేరకు.. శ్రీవారి ఆలయం ముందున్న సహస్రదీపాలంకరణ మండపానికి సమీపంలో యువకుడు అచేతనంగా పడిఉంటాన్ని భక్తులు, సిబ్బంది గుర్తించారు. వెంటనే పోలీసులకు సమాచారమిచ్చారు. వైద్య సిబ్బంది వచ్చి పరిశీలించారు. అప్పటికే మృతి చెందినట్టు నిర్ధారించారు. మృతదేహం వద్ద లభించిన ఆధార్‌కార్డు ప్రకారం తమిళనాడులోని తిరువళ్లూరుకు చెందిన మోహన సుందర్(35)గా తేలింది. చెన్నైలోని ఓ ఆస్పత్రిలో చికిత్స పొందినట్టు ప్రిస్క్రిప్షన్లు ఉండటంతో ఆనారోగ్యంతో మృతి చెంది ఉండవచ్చని భావిస్తున్నారు. కొద్దిరోజులుగా తిరుమలలోనే ఉంటున్నట్టు పోలీసులు తెలిపారు. మృతదేహాన్ని అశ్విని ఆస్పత్రికి తరలించారు. అతని కుటుంబ సభ్యులకు సమాచారమిచ్చారు.

మోహనసుందర్ మృతదేహం



మద్యం తాగి డ్రైవింగ్ చేసినందుకు సేవా శిక్ష

వెంకటగిరి టౌన్, ఏప్రిల్ 1(ఆంధ్రజ్యోతి): వెంకటగిరి పట్టణంలోని బంగారుపేటకు చెందిన పవన్‌కుమార్ ఆదివారం రాత్రి మద్యం తాగి, పెద్ద శబ్దాలు చేసుకుంటూ బైక్ నడుపుతుండడంతో ఎస్ఐ సుబ్బారావు అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేశారు. మంగళవారం కోర్టులో హాజరుపరచగా న్యాయమూర్తి రూ.500 జరిమానా విధించారు. అలాగే వెంకటగిరి ప్రభుత్వాస్పత్రిలో రోగులకు మధ్యాహ్నం రెండు గంటల నుంచి రాత్రి 8గంటల వరకు సేవ చేయాలని తీర్పు ఇచ్చారు. ఆస్పత్రిలో సేవ చేయకుండా తప్పించుకునేందుకు ప్రయత్నించినట్లయితే రిమాండ్ విధిస్తామని చెప్పారు. అనంతరం నిందితుడిని ప్రభుత్వాస్పత్రి సూపరింటెండెంట్ ఎదుట హాజరుపరిచినట్లు ఎస్ఐ సుబ్బారావు తెలిపారు.


ముక్కంటి భక్తులకు మజ్జిగ పంపిణీ

శ్రీకాళహస్తి, ఏప్రిల్ 1(ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తీశ్వరాలయంలోని క్యూలలో వేచి ఉండే భక్తులకు మజ్జిగ పంపిణీని మంగళవారం ప్రారంభించారు. వేసవి నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వ సూచనల మేరకు ఈ నిర్ణయం తీసుకున్నారు. సుమారు 8 ఏళ్ల కిందట అప్పటి ఈవో భ్రమరాంబ భక్తుల వేసవి తాపం తీర్చేందుకు మజ్జిగ పంపిణీ చేపట్టారు. అప్పట్లో స్వల్పసంఖ్యలో భక్తులకు మాత్రమే అమలు చేశారు. ఆ తర్వాత వైసీపీ అధికారంలోకి వచ్చింది. కొవిడ్ నుంచి మజ్జిగ పంపిణీ అటకెక్కింది. 2022 ఏప్రిల్ 17న వేసవి తాపంతో క్యూలైన్లలో గంటల తరబడి వేచి ఉన్న భక్తులు ఆర్తనాదాలు పెట్టడం అప్పట్లో దుమారం రేగింది. అప్పటి దేవదాయశాఖ మంత్రి కొట్టు సత్యనారాయణ ముక్కంటి ఆలయానికి వస్తున్నారన్న కారణంతో మండు వేసవిలో ఏప్రిల్ 17న క్యూలైన్లను కొంత సమయం స్తంభింపచేశారు. సరిగ్గా మంత్రి మహద్వారం వద్దకు చేరుకోగానే డౌన్‌డౌన్ అంటూ భక్తుల నుంచి ఆలయంలో నిరసన నినాదాలు మిన్నంటాయి. ఈ ఘటన తీవ్ర విమర్శలకు దారి తీసింది. ఆ తర్వాత వేసవిలో క్యూలైన్లలో అవసరమైన నీటి సరఫరాపై దృష్టి పెట్టారు. ఈ ఏడాది రాష్ట్ర ప్రభుత్వం సూచనలతో దేవదాయశాఖ అధికారులు ఆలయంలో భక్తులందరికి మజ్జిగ పంపిణీ చేసేలా ఆదేశాలు జారీ చేశారు. ఈ మేరకు ఆలయంలో మజ్జిగ పంపిణీ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఏఈవో సతీష్ మాలిక్, సూపరింటెండెంట్ నాగభూషణం తదితరులు పాల్గొన్నారు.



భక్తులకు మజ్జిగ పంపిణీ చేస్తున్న ఆలయ అధికారులు







● మరో రెండు నెలల్లో

తిరుపతి కొత్త రైల్వే స్టేషన్ అందుబాటులోకి

నయా స్టేషన్ ఆగయా

● తుదిమెరుగులు దిద్దుకుంటున్న దక్షిణం వైపు నిర్మాణాలు

● వచ్చే ఏడాది జూన్‌లో ఉత్తరం వైపు భవనం పూర్తి



నూతన భవనంలో ఏర్పాటు చేస్తున్న ఎస్కలేటర్

తిరుపతి, (సెంట్రల్), ఏప్రిల్1 (ఆంధ్రజ్యోతి): తిరుపతి రైల్వే స్టేషన్ ఆధునికీకరణ పనులు శరవేగంగా సాగుతున్నాయి. మరో రెండు నెలల్లో దక్షిణ వైపు నిర్మిస్తున్న నూతన భవనం అందుబాటులోకి రానుంది. రూ.300కోట్లతో వరల్డ్ క్లాస్ రైల్వేస్టేషన్‌గా తిరుపతిని మార్చేందుకు దక్షిణ మధ్య రైల్వే శ్రమిస్తోంది. దక్షణవైపు తుదిదశకు చేరుకున్న నిర్మాణాలను రైల్వే అధికారులు మీడియా ప్రతినిధులతో కలిసి మంగళవారం పరిశీలించారు. అనంతరం తిరుపతి స్టేషన్ డైరెక్టర్ కుప్పాల సత్యనారాయణ మీడియాతో మాట్లాడారు. 'దక్షిణమధ్య రైల్వేకు చెందిన ప్రధాన రైల్వే స్టేషన్లు సికింద్రాబాద్, నెల్లూరు, తిరుపతిలో అభివృద్ధి పనులు జరుగుతున్నాయి. వీటిలో తిరుపతిలో మరింత వేగంగా పనులు జరుగుతున్నాయి. తిరుపతి రైల్వే స్టేషన్ అంతర్జాతీయ ప్రమాణాలతో ప్రయాణికులకు మౌలిక వసతులు కల్పించాలని కేంద్ర ప్రభుత్వం రూ.300కోట్లతో పనులు ప్రారంభించింది. ప్రస్తుతం తిరుపతి రైల్వే స్టేషన్లో 80వేల మంది ప్రయాణికులు నిత్యం రాకపోకలు సాగిస్తున్నారు. భవిష్యత్తులో 1.5 లక్షల మంది రాకపోకలకు అవసరమైన సదుపాయాలను కల్పిస్తూ నిర్మాణాలు చేపడుతున్నాం. ఇప్పటికి 70 శాతం పనులు పూర్తయ్యాయి. ఉత్తరంలో నిర్మిస్తున్న పనులు వచ్చే ఏడాది జూన్‌లోపు పూర్తవుతాయి. ప్రస్తుతం తిరుపతి రైల్వే స్టేషన్లో ఆరు ఫ్లాట్ ఫాంలు ఉన్నాయి. మరో రెండు పెంచేందుకు ప్రతిపాదనలు పంపాం' అని వివరించారు. ఈ సమావేశంలో స్టేషన్ మేనేజర్ డాక్టర్ చిన్న రెడ్డెప్ప, ఏడీఈఎం ప్రభాకర్, పీఎంసీ నిర్మల్ కుమార్, కాంట్రాక్టర్ సంజయ్ కఠారే, ఆర్కే సింగ్, ఐపీఎఫ్ సందీప్ కుమార్, జీఆర్పీ సీఐ ఆశీర్వాదం తదితరులు పాల్గొన్నారు.

ప్రత్యేకతలివీ

ప్రస్తుతం నిర్మిస్తున్న జీ+3 భవనాల్లో (ఉత్తర-దక్షిణ భవనాలను కలుపుతూ) రెండు ఎయిర్ కాన్ కోర్సులు ఏర్పాటు చేశారు. వీటికి అనుసంధానంగా 12 ఎస్కలేటర్లు, 10 లిఫ్టులు పనిచేస్తాయి. వీటితో పాటు ప్రస్తుతమున్న రెండు ఫుట్ ఓవర్ బ్రిడ్జిలు కూడా ఉంటాయి. దక్షిణ దిక్కున కొత్త భవనంలోని అండర్ గ్రౌండ్‌లో 400 వాహనాలు పార్కింగ్ చేసుకునే సౌకర్యం ఉంది.

గ్రౌండ్ ఫ్లోర్: టికెట్ బుకింగ్ కౌంటర్లు, రిజర్వేషన్ కౌంటర్లు, ప్రయాణికుల విశ్రాంత గదులు, రైల్వే ఆపరేటింగ్ ఉద్యోగుల కార్యాలయాలు, ఎస్ఎంఆర్, ఏఎస్ఎం కార్యాలయాలు, వీఐపీ లాంజ్‌లు, క్లాక్ రూంలు ఉంటాయి.

ఫస్ట్ ఫ్లోర్: విశ్రాంత గదులు, ఫుడ్ కోర్టులు, దుకాణాలు

సెకండ్ ఫ్లోర్: రైల్వే విభాగాల కార్యాలయాలు, రిటైరింగ్ గదులను (ఆరు లిఫ్టులు, నాలుగు ఎస్కలేటర్లు) అందుబాటులోకి తీసుకొస్తున్నారు. ఈ నూతన భవనంపై మరో 7 అంతస్థులు పీపీపీకింద విశ్రాంతి గదులు, ఫుడ్ కోర్టులు నిర్మాణాలు చేపట్టే యోచనలో ఉన్నారు.



శివలింగాన్ని చుట్టుకున్న నాగుపాము



గుడిపాల, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): గుడిపాల మండలంలోని అత్తిగారిగుట్టలో వెలిసిన కాశీలింగేశ్వర ఆలయంలో శివలింగాన్ని మంగళవారం రాత్రి ఓ నాగుపాము చుట్టుకుని భక్తులకు దర్శనమిచ్చింది.

నేటి నుంచి జేఈఈ మెయిన్స్-2

తిరుపతి(విద్య), ఏప్రిల్ 1(ఆంధ్రజ్యోతి): జేఈఈ మెయిన్స్- 2 పరీక్షలు బుధవారం నుంచి ప్రారంభం కానున్నాయి. 24వ తేదీ వరకు, ఆ తర్వాత 7 నుంచి 9వ తేదీ వరకు పరీక్షలు జరుగనున్నాయి. తిరుపతి జూపార్కు సమీపంలోని చెర్లోపల్లి వద్ద వున్న అయాన్ డిజిటల్ జోన్ కేంద్రంగా రోజూ ఉదయం, మధ్యాహ్నం రెండు సెషన్‌లుగా పరీక్షలు జరుగుతాయని నేషనల్ టెస్టింగ్ ఏజన్సీ (ఎన్‌టీఏ) సిటీ కోఆర్డినేటర్ టి. కైలాసనాథ్ తెలిపారు. తొలి మూడు రోజుల్లో జరిగే పరీక్షలకు సుమారు 3వేల మంది విద్యార్థులు హాజరు కానున్నారు. మొదటి రోజు రెండు సెషన్లలో 1,156 మంది పరీక్షలు రాయనున్నట్లు అధికారులు తెలిపారు. ఉదయం సెషన్‌కు వచ్చే విద్యార్థులు 7 గంటలకే పరీక్ష కేంద్రంవద్దకు చేరుకోవాలి. 8.30 గంటలకే కేంద్రం గేట్లు మూసివేస్తారు. మధ్యాహ్నం 2 గంటలకు జరిగే పరీక్షకోసం విద్యార్థులు 12 గంటలకే కేంద్రం వద్దకు చేరుకోవాలి. 1.30 గంటలకు గేట్లు మూసివేస్తారు.

ఆస్తి లాక్కొని తరిమేశాడు

కుమారుడిపై డీఎస్పీకి చదళ్ల వృద్ధుడి ఫిర్యాదు



డీఎస్పీకి ఫిర్యాదులు చేస్తున్న అడ్వకేట్ ప్రేమ్‌కుమార్ - అమరనాథ్ దంపతులు



కృష్ణప్ప

పుంగనూరు, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): కన్నబిడ్డే వృద్ధాప్యంలో ఉన్న తనను మోసం చేసి ఆస్తి కాజేయడంతో పాటు పట్టించుకోకుండా వదిలేశాడని ఓ తండ్రి ఆవేదన వ్యక్తం చేశాడు. మంగళవారం పుంగనూరు పోలీస్‌స్టేషన్‌లో డీఎస్పీ ప్రభాకర్ మండల ప్రజలనుంచి ఫిర్యాదులను తీసుకుని వాటి పరిష్కారం కోసం సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. చదళ్ల గ్రామానికి చెందిన 80యేళ్ల జి.కృష్ణప్ప తన సమస్యను వివరిస్తూ..... తనతో పాటు తన భార్య వెంకటమ్మ పేర్లతో ఉన్న 13 ఎకరాల పొలాన్ని రెండవ కుమారుడు దేవరాజు, అతడి భార్య రాధిక కలసి మోసం చేసి వీలునామా రాసుకుని అక్రమంగా కాజేశారన్నారు. భూమికి సంబంధించి రికార్డులు మార్చుకున్నారని, నమ్మించి రిజిస్టర్ చేసుకుని మోసం చేశారని, తన భార్య చనిపోయాక తన గురించి పట్టించుకోవడంలేదని ఫిర్యాదు చేశారు. గతంలో పుంగనూరు పోలీసులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదన్నారు. తనకు న్యాయంచేసి తన భూమి తనకు ఇప్పించాలని కృష్ణప్ప కోరారు. డీఎస్పీ ప్రభాకర్ ఆయనకు సమాధానమిస్తూ... సెక్షన్ 7 క్లాజ్ 31 అమెండ్‌మెంట్ యాక్టు ప్రకారం వృద్ధాప్యంలో తల్లిదండ్రులను పట్టించుకోని పిల్లలపై చర్యలు తీసుకునేలా ఫిర్యాదు ఆధారంగా ఆర్డీవో భవానికి నివేదిక పంపుతున్నట్లు చెప్పారు. ఆస్తిని కృష్ణప్పకు అప్పగించేలా చర్యలు తీసుకోవాలని పేర్కొన్నట్లు తెలిపారు.చంద్రమాకులపల్లె పంచాయతీ కృష్ణాపురానికి చెందిన అమరనాథ్ దంపతులు మాట్లాడుతూ 764/1, 764/3 సర్వే నంబర్లలో వున్న తమ పొలంలోకి రాజకీయ పలుకుబడిగల పుల్లా నాయుడు రానివ్వకుండా అడ్డుపడుతున్నారని వాపోయారు. సర్వే చేసి తమ భూమి హద్దులు గుర్తించి ఆక్రమణలు తొలగించాలని విన్నవించారు. డీఎస్పీ ఫోన్‌లో తహసీల్దార్ రాముతో మాట్లాడారు. తాను విజయవాడలో హైకోర్టు పనిపై వచ్చానని, పుంగనూరుకు రాగానే సమస్య పరిష్కరిస్తానని చెప్పారు. పుంగనూరుకు చెందిన అడ్వకేట్ పూల ప్రేమ్‌కుమార్ డీఎస్పీని కలిసి గత ఏడాది మార్చి 14వ తేదీన తనపై స్థానిక మున్సిపల్ కార్యాలయంలో వైసీపీ నాయకులు దాడి చేశారన్నారు. 158/2024 మేరకు కేసు నమోదు చేసినా పోలీసులు చార్జ్‌షీట్ వేయలేదని తెలిపారు. న్యాయవాదులపై దాడులు జరిగినా నాటి పోలీసులు వైసీపీకి అనుకూలంగా వ్యవహరించి తనపై తప్పుడు కేసులు పెట్టారని, కేసు రాజీ పోవాలని వైసీపీ నేతలు భయపెడుతున్నారని వివరించారు.డీఎస్పీ ప్రభాకర్ విచారించి తగు న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు.అనంతరం డీఎస్పీ మీడియాతో మాట్లాడుతూ పుంగనూరు పోలీస్‌స్టేషన్‌లో ప్రతి మంగళవారం గ్రీవెన్స్‌డే నిర్వహిస్తామని చెప్పారు. తొలి గ్రీవెన్స్‌డేలో 8 ఫిర్యాదులు రాగా పోలీస్ శాఖ సమస్యలను విచారిస్తున్నామని, ఇతర సమస్యలను సంబంధిత అధికారుల దృష్టికి పంపామన్నారు. ఈ సమస్యలపై వచ్చే మంగళవారం నాటికి చర్యలుంటాయని తెలిపారు. గ్రామాల్లో సమస్యలు, గొడవలు, విభేదాలను గుర్తించి ముందస్తు చర్యలు తీసుకోనున్నట్లు తెలిపారు.సీఐ రాంభూపాల్, ఎస్ఐ లోకేశ్ పాల్గొన్నారు.





మార్లబండ సమీపంలో ఏనుగు హల్‌చల్ - ధ్వంసమైన వరి పంటను పరిశీలిస్తున్న అటవీ సిబ్బంది

గజ దాడులతో వణుకుతున్న రైతులు

క్షేత్రస్థాయి పరిశీలనకు రాని జిల్లా అటవీ అధికారి?

యాదమరి, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): యాదమరి సరిహద్దులోని దళవాయిపల్లె అటవీ ప్రాంతంలో తిష్ట వేసిన 25 గజరాజుల గుంపు పంట పొలాలపై దాడులు చేస్తున్నాయి. దీంతో అటవీ సమీపంలోని పది గ్రామాల రైతులు కంటిమీద కునుకు లేకుండా వణికిపోతున్నారు. దళవాయిపల్లె బట్టు కామాక్షిపురం వద్ద సోమవారం రాత్రి 14 ఏనుగుల గుంపు, ఒక ఒంటరి ఏనుగు, మార్లబండ, పెరుమాళ్లపెంట, కాశిరాళ్ల వద్ద మూడు ఏనుగుల గుంపు బీభత్సం సృష్టించాయి. కాశిరాళ్ల గ్రామానికి చెందిన రాజారత్నంకు చెందిన ఎకరం, ధనుష్‌కోటికి ఎకరం వరి పంటలను మూడు ఏనుగుల గుంపు తొక్కి ధ్వంసం చేశాయి. మార్లబండకు చెందిన శివాజి, భరత్ ఇంటి సమీపంలో వరి, అరటి, మామిడి, రాగి పంటలను నాశనం చేశాయి. కుప్పం నుంచి అదనంగా మరో ఏడుగురు అదనపు ట్రాకర్లను మండలానికి రప్పించారు. వీరి సాయంతో బాణసంచా కాల్చి గజరాజులను అడవిలోకి మళ్లించడానికి ప్రయత్నాలు చేస్తున్నారు. దెబ్బతిన్న పంటలను ఎఫ్ఎస్‌వో మోహనమురళి, ఎఫ్‌బీవో ప్రతాప్, సిబ్బంది పరిశీలించారు.

మా బాధలు పట్టవా?: రైతులు

యాదమరి మండల పరిధిలోనే మూడు నెలలుగా గజరాజులు తిష్ట వేసుకుని ఉన్నాయి. రైతులు వ్యయప్రయాసలకోర్చి జిల్లా కేంద్రానికి వచ్చి శాశ్వత పరిష్కారం చూపాలని అటవీ అధికారికి విన్నవించారు. అయితే అధికారి సమీక్షలకే పరిమితమై.. క్షేత్రస్థాయి పరిశీలనకు రావడం లేదని రైతులు వాపోతున్నారు. కార్యాలయానికే పరిమితమై తమ బాధలు పట్టించుకోకుంటే ఎలా అని ప్రశ్నిస్తున్నారు.

రూ.10లక్షలతో కందకాలు తవ్వడానికి కలెక్టర్ హామీ: ఎమ్మెల్యే

గజరాజుల వరుస దాడుల నేపథ్యంలో పూతలపట్టు ఎమ్మెల్యే మురళీమోహన్ మంగళవారం కలెక్టర్ సుమిత్‌కుమార్‌కు ఫోన్‌చేసి నివారణకు చర్యలు తీసుకోవాలని కోరారు. స్పందించిన కలెక్టర్.. కందకాలు తవ్వడానికి రూ.10లక్షల విడుదలకు హామీ ఇచ్చారని ఎమ్మెల్యే చెప్పారు. త్వరలోనే అటవీ సమీపంలోని 10 గ్రామాల పరిధిలో కందకాలు తవ్వే పనులు ప్రారంభిస్తామని ఎమ్మెల్యే పేర్కొన్నారు.

నాయీబ్రాహ్మణుల అభివృద్ధికి ప్రత్యేక కృషి

● టీటీడీ బోర్డు సభ్యులు శాంతారాం, నరేశ్‌కుమార్



సమావేశంలో మాట్లాడుతున్న టీటీడీ బోర్డు సభ్యుడు వైద్యం శాంతారాం

పుంగనూరు, ఏప్రిల్ 1(ఆంధ్రజ్యోతి): ఆర్థిక, ఆరోగ్యపరంగా వెనుకబడిన నాయీబ్రాహ్మణులను అన్ని రంగాల్లో ముందుకు తీసుకురావడానికి ప్రత్యేక కృషి చేస్తామని టీటీడీ బోర్డు సభ్యులు వైద్యం శాంతారాం, నరేశ్‌కుమార్ అన్నారు. మంగళవారం స్థానిక త్యాగరాజస్వామి కళాక్షేత్రంలో పుంగనూరు హిందూ సత్యధర్మ దివ్యజ్ఞానజ్యోతి సంస్థచే ఉగాది సందర్భంగా వివిధ రంగాల్లో సేవలందించిన పలువురికి ప్రతిష్టాత్మక పురస్కారాలు అందజేసి ఘనంగా సన్మానించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ వెంకటేశ్వరస్వామికి సేవ చేసుకునే అదృష్టం సీఎం చంద్రబాబు కల్పించారని, ఇది తమ పూర్వజన్మ సుకృతమన్నారు. నాయీబ్రాహ్మణులు ఐక్యంగా ఉంటూ అభివృద్ధి చెందడానికి ముందడుగు వేయాలని పిలుపునిచ్చారు. తమ కులం, వెనుకబడిన కులాల అభివృద్ధి సంక్షేమం కోసం సీఎం చంద్రబాబు అమలు చేస్తున్న కార్యక్రమాలను సద్వినియోగం చేసుకోవాలని చెప్పారు. ఆదరణ, తదితర పథకాలు, నాయీబ్రాహ్మణుల సమస్యలు, అభివృద్ధి, సంక్షేమం గురించి ప్రభుత్వం దృష్టికి తీసుకెళతామని చెప్పారు. పుంగనూరులో త్యాగరాజస్వామి ఆలయ నిర్మాణానికి సహకారమందిస్తామని తెలిపారు. సంస్థ నిర్వహిస్తున్న కార్యక్రమాలను వ్యవస్థాపకులు ఎం.వెంకటేశ్ వివరించగా అతిథులు ప్రశంసించారు. టీటీడీ బోర్డు సభ్యులు వైద్యం శాంతారాం, కర్నాటక బీజేపీ నేత, బోర్డు సభ్యుడు నరేశ్‌కుమార్, తెలుగుకళావేదిక వ్యవస్థాపకులు కోడూరు సుమనశ్రీ, హిందూ జాగరణ సమితి పరమేశ్, అన్నమాచార్య ప్రాజెక్టు గంగులప్ప, రాష్ట్ర నాయీబ్రాహ్మణ సంక్షేమ కార్పొరేషన్ చైర్మన్ రుద్రకోటి సదాశివం, ఎస్.ప్రకాశ్, ఇట్టా భానుప్రకాశ్‌లకు పురస్కారాలు అందజేసి ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో పలువురు కూచిపూడి, భరతనాట్యం, కచేరి, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. టీటీడీ పరిధిలోని కోనేరు వద్ద వెలసిన కల్యాణవెంకటరమణ స్వామి ఆలయంలో బోర్డు సభ్యులకు వేదపండితులు పూర్ణకుంభ స్వాగతం పలికి, స్వామి దర్శనం కల్పించారు. కార్యక్రమంలో సంస్థ ప్రతినిధులు వెంకటేశ్, ప్రముఖులు బాలసుబ్రహ్మణ్యం, వెంకటపతి, భద్రయ్య, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

రూ.2.63 లక్షల పింఛను సొమ్ముతో పరార్

● సచివాలయ ఉద్యోగి సస్పెన్షన్

సత్యవేడు, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి):పింఛను సొమ్ముతో సచివాలయ ఉద్యోగి పరారైన ఘటన సత్యవేడు మండలంలో మంగళవారం జరిగింది. తన పరిధిలోని లబ్ధిదారులకు పింఛను అందజేసేందుకు కాళమనాయుడుపేట సచివాలయంలో వెటర్నరీ అసిస్టెంట్ షాహిదుల్లా సోమవారం కార్యాలయం నుంచి రూ.2,63,000 తీసుకున్నాడు. ఈ సొమ్మును కొత్తమారికుప్పంలో 63 మందికి పంపిణీ చేయాలి. మంగళవారం ఉదయం 11 గంటలవుతున్నా లబ్ధిదారులకు నగదు అందలేదు. ఈ విషయం తెలిసి షాహిదుల్లాకు ఎంపీడీవో చంద్రశేఖర్ ఫోను చేయగా స్విచ్‌ఆఫ్ వచ్చింది.దీంతో అతడిపై పోలీసులకు ఫిర్యాదు చేశారు. కాగా, షాహిదుల్లా విధుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుంటాడని గతంలో కూడా పలుమార్లు అధికారులకు ఫిర్యాదులందాయి.ఉన్నతాధికారులు హెచ్చరించినా మార్పు రాలేదు. కాగా, పింఛన్ సొమ్ము పంపిణీ చేయకుండా, నగదు దుర్వినియోగం చేసిన షాహిదుల్లాను పెండింగ్ ఎంక్వైరీ కింద సస్పెండ్ చేస్తూ తిరుపతి కలెక్టర్ వెంకటేశ్వర్ ఉత్తర్వులు జారీ చేశారు. మరోవైపు అతడిపై శాఖాపరమైన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.

'రెవెన్యూ' అర్జీల పరిశీలనకు ప్రత్యేక బృందాలు

చిత్తూరు కలెక్టరేట్, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): ఇదివరకు జరిగిన రెవెన్యూ సదస్సులు, రీసర్వేపై వచ్చిన 3000కు పైగా అర్జీలను ఆడిట్ చేయడానికి 20 ప్రత్యేక బృందాలను కలెక్టర్ సుమిత్‌కుమార్ ఏర్పాటు చేశారు.ప్రతి బృందానికి తహసీల్దార్ లేదా డిప్యూటీ తహసీల్దార్ నాయకత్వం వహిస్తారు. మండలాల వారీగా అధికారుల వివరాలిలా..పుంగనూరు, చౌడేపల్లెలకు తహసీల్దార్ ఎస్.షబ్బార్ బాషా, పులిచెర్ల, రొంపిచెర్లకు తహసీల్దార్ ఇ.అమర్‌నాథ్, చిత్తూరు రూరల్‌కు డీటీ ఎ.నిర్మల, పాలసముద్రం, పెనుమూరులకు డీటీ ఎ.కిరణ్‌కుమార్, గంగవరానికి డీటీ హరికృష్ణ, తవణంపల్లెకు డీటీ వెంకటేష్, పలమనేరు, బంగారుపాళ్యంకు హేమాద్రిరాజు, పెద్దపంజాణికి డీటీ దొరబాబు, యాదమరికి డీటీ కె.సోనియా, వెదురుకుప్పానికి డీటీ సంపత్‌కుమార్, సోమల, సదుంకు డీటీ మధుసూదన్, పూతలపట్టు, ఐరాలకు డీటీ వరప్రసాద్, గుడిపాలకు డీటీ శోభ, శ్రీరంగరాజపురం, గంగాధరనెల్లూరుకు డీటీ కిరణ్‌కుమార్, నగరి, కార్వేటినగరంకు డీటీ నాగరాజు, చిత్తూరు అర్బన్ మండలానికి డీటీ గిరిజాకుమారి, గుడుపల్లె, రామకుప్పంకు డీఎస్వో కార్యాలయ డీటీ ఎ.శ్యామ్‌ప్రసాద్ రెడ్డి, కుప్పం, శాంతిపురంకు కుప్పం ఆర్డీవో కార్యాలయ డీటీ ఎస్.దేవరాజ్, వి.కోట, బైరెడ్డిపల్లెకు పలమనేరు ఆర్డీవో కార్యాలయ డీటీ పి.రమేష్, నింద్ర, విజయపురం మండలాలకు నగరి ఆర్డీవో కార్యాలయ డీటీ ఎస్.విజయ్‌కుమార్‌లను కలెక్టర్ నియమించారు. ఈ బృందాలకు ఒక్కో సీనియర్ లేదా జూనియర్ అసిస్టెంట్లను సహాయకులుగా నియమించారు. ఈ బృందాలు రెండ్రోజులపాటు వారికి కేటాయించిన మండలంలోనే ఉంటూ ర్యాండమ్‌గా వంద చొప్పున అర్జీలను ఆడిట్ చేయాల్సివుంటుంది.

పశువుల నీటి తొట్టెలకు భూమి పూజ



పింఛన్లు పంపిణీ చేస్తున్న చల్లా రామచంద్రారెడ్డి

రొంపిచెర్ల, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పెద్దగొట్టిగల్లు పంచాయతీ గెర్లపల్లెలో మంగళవారం పల్లెపండుగ కార్యక్రమంలో భాగంగా పశువుల దాహార్తి తీర్చే నీటి తొట్టెల నిర్మాణానికి పుంగనూరు నియోజవర్గ టీడీపీ ఇన్‌చార్జి చల్లా రామచంద్రారెడ్డి భూమిపూజ చేశారు. ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు నోరులేని పశువుల దాహం తీర్చేందుకు మండలానికి 93 నీటి తొట్టెలు మంజూరు చేశారన్నారు. పెద్దగొట్టిగల్లు పంచాయతీలోనే 9 తొట్టెలు నిర్మిస్తారని, ఒక్కొక్కదానికి రూ.33 వేలు చొప్పున ప్రభుత్వం ఇస్తుందన్నారు. పెద్దగొటిగల్లు క్రాస్‌లో ఎన్టీఆర్ భరోసా పించన్లను ఆయన పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో రాజంపేట పార్లమెంట్ టీడీపీ రైతు అధ్యక్షుడు ఓబులేశ్వరరెడ్డి, రాష్ట్ర కురబ కార్పొరేషన్ డైరెక్టరు ఉయ్యాల రమణ, నాయకులు మదనమోహన్ రెడ్డి, శరత్‌కుమార్‌రెడ్డి, అమరనాథరెడ్డి, నాగిశెట్టిబాబు, ఎస్.వెంకట్రమణ, రవి కుమార్ నాయుడు, పి.రామమూర్తి, పొన్నం వెంకట్రమణ, ఎంపీడీవో మధుసూదన్‌రెడ్డి, ఏపీవో బాలమురళీ తదితరులు పాల్గొన్నారు.

పాస్టర్ ప్రవీణ్ మృతిపై సమగ్ర దర్యాప్తు చేపట్టాలి



కల్లూరులో మాట్లాడుతున్న పాస్టర్ ధన్‌రాజ్

కల్లూరు, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): పాస్టర్ ప్రవీణ్ పగడాల మృతిపై రాష్ట్ర ప్రభుత్వం సమగ్ర దర్యాప్తు చేపట్టాలని పాస్టర్లు ధన్‌రాజ్, జార్జి, జాన్సన్, తిమోతి, సంపత్ కోరారు. పులిచెర్ల మండలం కల్లూరు బీసీ కాలనీలోని క్రైస్ట్ చర్చిలో మంగళవారం జిల్లాలోని పలువురు క్రైస్తవ మత పెద్దలు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పాస్టర్లు మాట్లాడుతూ పాస్టర్ ప్రవీణ్ అనుమానాస్పద మృతిపై పోలీసుశాఖ నిజానిజాలు వెల్లడించాలన్నారు. ఆయన మృతిపై ప్రజల్లో అనేక అనుమానాలున్నాయన్నారు. యాక్సిడెంట్ అని కొందరు, హత్య అని మరి కొందరు భావిస్తున్నారన్నారు. ఈ మృతి కేసును ఛేదించాల్సిన బాధ్యత పోలీసులపై ఉందన్నారు. పాస్టర్ ప్రవీణ్ కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలన్నారు. క్రైస్తవులు, పాస్టర్లకు భద్రత కల్పించాలని కోరారు. అనంతరం క్రైస్తవుల ఐక్యత వర్ధిల్లాలి అంటూ ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాస్టర్లు ప్రతాప్, ప్రేమ్‌కుమార్, రాజ్‌కుమార్, యర్రయ్య, ఏలయా, ప్రవీణ్, డేవిడ్ శివ తదితరులు పాల్గొన్నారు.

మెప్మా సభ్యులకు అభినందన



మెప్మా సభ్యులను అభినందిస్తున్న ఎమ్మెల్యే అమరనాథరెడ్డి

పలమనేరు, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని మెప్మా సభ్యులు గిన్నీస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డు సాధించడంతో పలమనేరు మెప్మా సిబ్బందిని కూడా ఎమ్మెల్యే అమరనాథరెడ్డి అభినందించారు. పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ మెప్మా పరిధిలోని సభ్యులు ఎస్‌హెచ్‌జీ ఉత్పత్తులను ఆన్‌లైన్ ప్లాట్‌ఫాం ద్వారా గతనెల 8న రాష్ట్రస్థాయిలో రూ.1.13 లక్షల పైచిలుకు విక్రయించిన సందర్భంగా గిన్నీస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డు సాధించారు. ఈ సర్టిఫికెట్‌ను ముఖ్యమంత్రి చేతుల మీదుగా మెప్మా మిషన్ డైరెక్టర్ ఎస్.తేజ్‌భరత్ అందుకొన్నారు. ఈ సర్టిఫికెట్‌ను ప్రదర్శన నిమిత్తం అన్ని పురపాలక సంఘాలకు ప్రభుత్వం పంపించింది. మంగళవారం ఈ సర్టిఫికెట్‌ను ఎమ్మెల్యే అమరనాథరెడ్డి ఇక్కడి మెప్మా సభ్యులకు అందజేసి అభినందనలు తెలిపారు. ఆయన మాట్లాడుతూ మెప్మా సిబ్బంది సభ్యులందరినీ ఎంటర్‌పెన్యూర్లుగా తీర్చిదిద్ది వ్యాపార అవకాశాలను పెంపొందించాలని సూచించారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ ఎస్.వి.రమణారెడ్డి, మెప్మా సీఎంఎం బాబా, టీడీపీ నాయకులు ఖాజాపీర్, నాగరాజు, మదన్‌మోహన్, సీవోలు ధనలక్ష్మి, ఎ.జయంతి, ఆర్‌పీలు పాల్గొన్నారు.

తాగునీటి సమస్యకు పరిష్కారం



ప్రభుత్వ బోరు ఉన్న స్థలాన్ని పరిశీలిస్తున్న ఎంపీడీవో తదితరులు

సోమల, ఏప్రిల్ 1(ఆంధ్రజ్యోతి): సోమల మండలం అన్నెమ్మగారిపల్లె పంచాయతీ చింపిరెడ్డిపల్లెలో గత మూడు నెలలుగా నెలకొన్న తాగునీటి సమస్య మంగళ వారం అధికారుల చొరవతో పరిష్కారమైంది. గ్రామంలోని మునస్వామి ఇంటి ఆవరణలో ప్రభుత్వం బోరు డ్రిల్లింగ్ చేసి నీటి సరఫరా చేస్తుండేది. గత మూడు నెలలుగా మునస్వామి కుటుంబ సభ్యులు తరచూ తాగునీటికి ఇబ్బందులు పెడుతున్నారు. ఈక్రమంలో గ్రామంలో తాగునీటి సమస్య నెలకొంది. మంగళవారం గ్రామస్తులు సోమల ఎంపీడీవో నారాయణకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు ఎంపీడీవో, కార్యదర్శి లలిత చింపిరెడ్డిపల్లెలో ప్రభుత్వ బోరు స్థలాన్ని సందర్శించి మునస్వామి కుటుంబసభ్యులతో చర్చించి తాగునీటి సమస్యను పరిష్కరించారు.

విద్యుత్ ఉద్యోగికి అంబేడ్కర్ సేవారత్న అవార్డు



డాక్టర్ అంబేడ్కర్ సేవారత్న అవార్డు అందుకుంటున్న సుమిత్ర రమణ

పుంగనూరు రూరల్, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): విద్యుత్‌శాఖలో పని చేస్తున్న పుంగనూరుకు చెందిన సుమిత్ర రమణకు డాక్టర్ అంబేడ్కర్ సేవా రత్న అవార్డును రిపబ్లిక్ పార్టీ అధ్యక్షుడు దాసరి చెన్నకేశవులు, ఉద్యోగులసంక్షేమ సంఘ రాష్ట్ర అధ్యక్షుడు అశోక్‌కుమార్‌లు అందజేశారు. ఉగాది పండుగ సందర్భంగా ప్రకాశం జిల్లా తూర్పునాయుడుపేటలో జరిగిన సమావేశంలో సుమిత్ర రమణ సేవలు గుర్తించి అవార్డు అందించినట్లు తెలిపారు. దీంతో పుంగనూరు ఉద్యోగులు, దళిత సంఘ నాయకులు మంగళవారం ఆయన్ను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో రెడ్డెప్ప, బాలసుబ్రహ్మణ్యం, మహానంది, చంద్రన్న, జేవీ నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

రూ.25 లక్షలతో తాగునీటి పనులకు ప్రతిపాదనలు

రొంపిచెర్ల, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): మండలంలో వేసవిని దృష్టిలో ఉంచుకొని ముందస్తుగా రూ.25 లక్షలతో తాగునీటి పనులకు ప్రతిపాదనలను జిల్లా అధికారులకు పంపినట్లు ఆర్‌డబ్ల్యూఎస్ ఇంజనీరు వేణుగోపాల్, ఈవోపీఆర్డీ సత్యంరెడ్డి తెలిపారు. స్థానిక పంచాయతీ కార్యాలయంలో మంగళవారం వారు మాట్లాడుతూ ఎల్లంకివారిపల్లెలో రూ.1.30 లక్షలతో బోరు వేశామని, రూ.3.5 లక్షలతో మోటరు, తాగునీటి ట్యాంక్, పైపులైన్ అవసరం ఉన్నట్లు తెలిపారు. రొంపిచెర్ల పంచాయతీలో రూ.1.60 లక్షలతో చెన్నాయనిచెరువు కాలనీకి పైపులైన్ ఏర్పాటు చేశామని, మోటుమల్లెల పంచాయతీ వంకిరెడ్డిగారిపల్లె, చెంచమరెడ్డిగారిపల్లె, బెస్తపల్లెలో బోర్లువేసి తాగునీటి సమస్య పరిష్కరించామన్నారు.

పాలిసెట్‌కు
నేటి నుంచి ఉచిత శిక్షణ

పలమనేరు, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ, ప్రైవేటు పాలిటెక్నిక్‌లలో ప్రవేశాల కొరకు జరిగే పాలిసెట్ పరీక్షకు దరఖాస్తు చేసిన అభ్యర్థులకు పలమనేరు ప్రభుత్వ మహిళా పాలిటెక్నిక్‌లో ఈనెల 2వ తేది బుధవారం నుంచి ఉచిత శిక్షణ ఇస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ బెహరా శ్రీనివాస్ తెలిపారు. ఈ పరీక్ష ఏప్రిల్ 30న జరుగుతుందని పేర్కొన్నారు. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు ఈ శిక్షణ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ అవకాశాన్ని ప్రవేశపరీక్షకు దరఖాస్తు చేసుకొన్న విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. ఈనెల 15వ తేదీలోగా పాలిసెట్‌కు దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ తెలిపారు.

కుప్పంలో...

కుప్పం, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): పాలిటెక్నిక్ డిప్లమా కోర్సులో ప్రవేశం కోసం రాష్ట్ర సాంకేతిక విద్య, శిక్షణా మండలివారు నిర్వహించే పాలిసెట్-2025కు ఏప్రిల్ 3వ తేదీ నుంచి డా.వెస్లీ జేమ్స్ యేస్ ప్రభుత్వ పాలిటెక్నిక్‌లో ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు ప్రిన్సిపాల్ జగన్నాథరావు తెలిపారు. ఈ శిక్షణకు హాజరు కాదలచుకున్నవారు పాలిసెట్‌కు దరకాస్తు చేసుకున్న రసీదును తీసుకునిరావాలన్నారు. ప్రతిరోజు ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు.

సాంఘీక శాస్త్రం పరీక్షకు
10 మంది విద్యార్థుల గైర్హాజరు

పలమనేరు, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): పలమనేరు మండలంలో 10వ తరగతి సాంఘీక శాస్త్రం పరీక్షకు మంగళవారం 10 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారని ఎంఈవోలు లీలారాణి, బాలసుందరం తెలిపారు. మండలంలో మొత్తం 7 పరీక్ష కేంద్రాల్లో 1,377 మంది విద్యార్థులకు గాను 1,367 మంది విద్యార్థులు హాజరయ్యారని వారు పేర్కొన్నారు. 10వ తరగతి పరీక్షలు మంగళవారంతో ముగిశాయని, మండలంలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు లేకుండా ప్రశాంత వాతావరణంలో విద్యార్థులు పరీక్షలు రాశారని వారు తెలిపారు.

డిపాజిట్ దారులకు అధిక వడ్డీ

గంగవరం, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): డిపాజిట్ దారులకు అత్యధిక వడ్డీని అందిస్తున్నామని గంగవరం గ్రామీణ బ్యాంక్ అధికారులు మంగళవారం గంగవరంలో ఇంటింటా ప్రచారం నిర్వహించారు. డిపాజిట్ దారులు ఒకటి నుంచి 2 సంవత్సరాల లోపు డిపాజిట్లపై 7.75 శాతం, 2 నుంచి 3 సంవత్సరాల లోపు డిపాజిట్లకు 7.90 శాతం వడ్డీ చెల్లించనున్నట్లు తెలిపారు. బ్యాంకు ఖాతాదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కరపత్రాలను పంపిణీ చేశారు.

రాయితీపై వ్యవసాయ పరికరాలు

వి.కోట, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): వి.కోట మండలంలో రాయితీపై వ్యక్తిగత వ్యవసాయ పరికరాలు పొందేందుకు అర్హులైన రైతులు దరకాస్తు చేసుకోవాలని ఏవో రాజ్యలక్ష్మి తెలిపారు. బ్యాటరీ స్ప్రేయర్లు 8, పవర్ స్ప్రేయర్లు 19, ట్రాక్టర్ మడకలు 24, రోటవేటర్లు 1 మండలానికి కేటాయించారన్నారు. చిన్న, సన్నకారు రైతులు, గత ఐదేళ్లుగా వ్యవసాయ శాఖ ద్వారా రాయితీ పొందని వారు, గత ఆరు సీజన్లుగా ఈక్రాప్ నమోదు చేసుకున్న వారు అర్హులన్నారు. ఒక్క కుటుంబానికి ఒక్క పరికరం మాత్రమే ఇవ్వబడునన్నారు.

ఆర్టీసీ స్థలాల లీజు కోసం
రేపు సమావేశం

పలమనేరు, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): పలమనేరు ఆర్టీసీ డిపో, బంగారుపాళ్యం, చౌడేపల్లి ఆర్టీసీ బస్టాండుల వద్ద ఉన్న ఖాళీ స్థలాలను లీజుకిచ్చే అంశంపై ఈనెల 3వతేది గురువారం గుత్తేదారుల సమావేశం నిర్వహిస్తున్నట్లు డిపో మేనేజర్ టీకే స్వామి తెలిపారు. ఉదయం 11 గంటలకు పలమనేరు డిపో కార్యాలయంలో ఈ సమావేశం నిర్వహిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. ఈ సమావేశంలో ఏయే స్థలాలు ఎంతకు లీజుకు ఇవ్వాలి, బిల్డింగ్ కండీషన్లు, అన్ని వివరాలు తెలియజేస్తామన్నారు. ఆర్టీసీకి చెందిన స్థలాలను 5, 10, 15 సంవత్సరాలకు లీజుకు ఇవ్వనున్నట్లు డిపో మేనేజర్ తెలిపారు. ఆసక్తి గల గుత్తేదారులు ఈ సమావేశానికి హాజరై మిగిలిన వివరాలను తెలుసుకోవలని ఆయన కోరారు.

ఘనంగా గంగ జాతర



కర్ణంవారిపల్లెలో ప్రత్యేక అలంకారంలో నడివీధి గంగమ్మ

చౌడేపల్లె, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పలు గ్రామాల్లో మంగళవారం గంగ జాతరను ఘనంగా నిర్వహించారు. కర్ణంవారిపల్లె, కొలింపల్లె గ్రామాల్లోని పొలిమేరల్లో ఉన్న గ్రామ దేవతలకు మహిళలు దీపాలు, దివ్వెలు మంగళ వాయిద్యాల నడుమ సమర్పించారు. అనంతరం గ్రామంలోని గంగమ్మకు జంతు బలులు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. బంధుమిత్రులతో కలసి విందులు చేసి, గంగ జాతరలను ఘనంగా నిర్వహించుకున్నారు.

ల్యాబ్ రికార్డుల పరిశీలన



రక్త నమూనాలను పరిశీలిస్తున్న జయశంకర్

గంగవరం, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): గంగవరం పీహెచ్‌సీలోని ల్యాబ్ రికార్డులను మంగళవారం పలమనేరు మలేరియా సబ్ యూనిట్ అధికారి జయశంకర్ ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ఆసుపత్రిలో ల్యాబ్ రికార్డులు, రక్త నమూనాలను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. ఆయన మాట్లాడుతూ.. ఆస్పత్రికి వచ్చే రోగులకు జ్వరాలు, బీపీ, షుగర్ వ్యాధిగ్రస్థులతో పాటు అనుమానం ఉన్న ప్రతి ఒక్కరికీ రక్త పరీక్షలు చేసి, రక్త నమూనాల నివేదికను వైద్యాధికారికి, మలేరియా సబ్ యూనిట్ కార్యాలయానికి అందించాలన్నారు. త్వరితగతిన రక్త పరీక్షల ఫలితాలను తెలపడం ద్వారా రోగికి వ్యాధి తీవ్రతరం కాకుండా నిర్మూలించడానికి దోహదపడుతుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో పీహెచ్‌సీ సూపర్వైజర్ జ్యోతీశ్వర్, ల్యాబ్‌టెక్నీషియన్ పరమేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

గ్రామీణాభివృద్ధే ప్రభుత్వ ధ్యేయం

- ఎమ్మెల్యే అమరనాథరెడ్డి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే అమరనాథరెడ్డి

గంగవరం, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): గ్రామీణాభివృద్ధే లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తోందని పలమనేరు ఎమ్మెల్యే అమరనాథ రెడ్డి అన్నారు. మంగళవారం మండలంలోని కీలపల్లె పంచాయతీ జేఆర్ కొత్తపల్లెలో నిర్వహించిన పల్లెపండుగ కార్యక్రమంలో భాగంగా ఉపాధి పథకంలో పశువులకు నీటితొట్టెల నిర్మాణ పనులకు ఎమ్మెల్యే భూమిపూజ చేసి ప్రసంగించారు. పలమనేరు నియోజకవర్గంలో పశువుల దాహార్తిని తీర్చడం కోసం 187 నీటి తొట్టెల నిర్మాణానికి రూ.62 లక్షల నిధులను ప్రభుత్వం మంజూరు చేసిందన్నారు. ఉపాధి పథకం ద్వారా రైతులకు అనేక ప్రయోజనాలు చేకూరుతున్నాయని, జాబ్‌కార్డు కలిగిన ప్రతి ఒక్కరూ ఈ పనులను సద్వినియోగం చేసుకొని ఆర్థికంగా బలపడాలని సూచించారు. గ్రామాల్లో రోడ్లు, డ్రైనేజి కాలువలు తదితర మౌలిక సదుపాయాల కల్పన కోసం ప్రభుత్వం కోట్లాది రూపాయలు మంజూరు చేస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో డ్వామా పీడీ ఎ.రవికుమార్, ఏపీడీ ఎస్.రవికుమార్, ఎంపీడీవో సురేష్‌కుమార్, తహసీల్దార్ మాధవరాజు, ఏపీవో శ్రీనివాసులు, ఏపీఎం హరినాథ్, టీడీపీ మండల అధ్యక్షుడు సోమశేఖర్‌గౌడు, ప్రతాప్ రెడ్డి, వెంకటరమణరెడ్డి, నాగరాజురెడ్డి, ఆలకుప్పం రాజన్న, మునస్వామిరెడ్డి, గిరిధర్ గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

కార్యకర్తలకు అండగా ఉంటా

- పుంగనూరు టీడీపీ ఇన్‌ఛార్జ్ చల్లా బాబు
- సదుంలో పార్టీ శ్రేణుల ఘనస్వాగతం



చల్లా బాబు సమక్షంలో టీడీపీలో చేరిన నాయకులు

సదుం, ఏప్రిల్ 1(ఆంధ్రజ్యోతి): పార్టీ కార్యకర్తలకు అండగా ఉంటానని పుంగనూరు నియోజకవర్గ టీడీపీ ఇన్‌ఛార్జ్ చల్లా రామచంద్రారెడ్డి (చల్లా బాబు) అన్నారు. సదుం మండలంలోని చింతపర్తివారిపల్లెలో మంగళవారం ఆయన పర్యటించారు. మండల టీడీపీ శ్రేణులు ఆయనకు మంగళ వాయిద్యాల నడుమ గజమాలతో ఘనస్వాగతం పలికారు. వాహన కాన్వాయ్‌పై అడుగడుగునా పూల వర్షం కురిపించారు. స్థానిక మూడు రోడ్ల కూడలిలో టీడీపీ జెండాను ఆయన ఆవిష్కరించారు. అనంతరం పెద్దసంఖ్యలో వైసీపీ, తటస్థ నాయకులు ఆయన సమక్షంలో టీడీపీలో చేరారు. వారందరికీ ఆయన పసుపు కండువాలు కప్పి టీడీపీలోకి సాదరంగా ఆహ్వానించారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేసిన నాయకులు శ్రీకాంత్‌రెడ్డి, రెడ్డి ప్రసాద్‌రెడ్డిలను ఆయన అభినందించారు. కార్యక్రమానికి హాజరైన వారందరికీ సామూహిక వనభోజనం ఏర్పాటు చేశారు. స్థానికుల నుంచి చల్లా బాబు పలు వినతులు స్వీకరించారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ ఈ ప్రభుత్వం ఏర్పడ్డాక వైసీపీ కబంధ హస్తాల నుంచి సదుం మండల ప్రజలకు స్వేచ్ఛా జీవితం లభించిందన్నారు. పల్లెల్లో తాము ఊహించనంతగా టీడీపీకి ఆదరాభిమానాలు దక్కడం ఆనందంగా ఉందన్నారు. కార్యకర్తలకు అర్ధరాత్రి వేళలోనైనా అందుబాటులో ఉంటానని పార్టీ శ్రేణుల హర్షాతిరేకాల మధ్య భరోసా కల్పించారు. ఈ కార్యక్రమంలో మండల కన్వీనర్ రెడ్డి ప్రసాద్‌రెడ్డి, నాయకులు శ్రీనివాసులురెడ్డి, శ్రీకాంత్‌రెడ్డి, ఎర్రగుంట్ల మహేశ్వరరెడ్డి, మనోజ్‌కుమార్‌రెడ్డి, నారాయణ, జ్యోతిశ్‌రెడ్డి, సునీల్‌కుమార్‌రెడ్డి, అమరనాథ్‌గౌడ్, మహేశ్‌రెడ్డి, ఎర్రంరెడ్డి, కుమార్, రఘునాథరెడ్డి, అబ్బిరెడ్డి, పవన్‌కుమార్‌రెడ్డి, నారాయణగౌడ్, పవన్‌కుమార్, పెద్దసంఖ్యలో కార్యకర్తలు పాల్గొన్నారు.

పేదల సేవలో ప్రభుత్వం



పింఛను అందజేస్తున్న ప్రేమ్‌కుమార్, టీడీపీ నేతలు

కుప్పం, ఏప్రిల్ 1(ఆంధ్రజ్యోతి): కుప్పం మండలం నారాయణపురం తాండాలో పేదల సేవలో ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా లబ్ధిదారులకు పించన్లను రూరల్ టీడీపీ అధ్యక్షుడు ప్రేమ్‌కుమార్, మున్సిపల్ అధ్యక్షుడు రాజ్‌కుమార్ అందజేశారు. ఈ సందర్భంగా గ్రామస్తులతో వారు మాట్లాడుతూ పార్టీ పిలుపు మేరకు అన్ని పంచాయతీలు, బూత్‌లలో కుటుంబ సాధికార సభ్యులు, కేఎస్‌ఎల్‌లు తప్పనిసరిగా పాల్గొనాలన్నారు. రానున్న వేసవిని దృష్టిలో ఉంచుకుని ఎక్కడా తాగునీటి సమస్య రాకుండా చూసుకోవాలన్నారు. స్థానిక నేతలు నిత్యం ప్రజలతో ఉండాలని, వారి సమస్యలను ఎప్పటికప్పుడు తెలుసుకుని, పరిష్కారంపై దృష్టి సారించాలని సూచించారు.

ప్రకృతి వ్యవసాయంపై దృష్టి సారించాలి



కల్లూరులో ప్రకృతి వ్యవసాయ పంటలను పరిశీలిస్తున్న వాసు

కల్లూరు, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): రైతులు ప్రకృతి వ్యవసాయంపై దృష్టి సారించాలని ప్రకృతి వ్యవసాయం జిల్లా ప్రాజెక్ట్ మేనేజర్ వాసు తెలిపారు. పులిచెర్ల మండలం కల్లూరులో మంగళవారం ప్రకృతి వ్యవసాయ పంటలను ఆయన పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ పాత వ్యవసాయ పద్ధతుల ద్వారా సేంద్రియ వ్యవసాయం పెరగాలని, గో ఆధారిత వ్యవసాయంపై అవగాహన ఉండాలని చెప్పారు. సేంద్రియ పద్ధతులతో పండించిన కూరగాయల వాడకంపై ప్రజలు ఆసక్తి చూపుతున్నారన్నారు. సహజసిద్ధ పంట ఉత్పత్తులకు మార్కెట్లో డిమాండ్ ఉందని, తక్కువ పెట్టుబడితో అధిక లాభాలు సాధ్యమని తెలిపారు. సిబ్బంది పాల్గొన్నారు.

డీవైఈవోకు 'ఫ్యాప్టో' నివాళి



చంద్రశేఖర్ చిత్రపటం వద్ద నివాళి అర్పిస్తున్న ఫ్యాప్టో నాయకులు

చిత్తూరు సెంట్రల్, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): అనారోగ్యంతో మృతి చెందిన చిత్తూరు డీవైఈవో చంద్రశేఖర్ చిత్రపటానికి పూలమాల వేసి, 'ఫ్యాప్టో' నాయకులు నివాళి అర్పించారు. మంగళవారం ఎన్జీవో కార్యాలయంలో ఈ కార్యక్రమం జరిగింది. అంతకుముందు బుధవారం కలెక్టరేట్ ముందు చేపట్టే నిరసన కార్యక్రమంపై సమావేశం నిర్వహించారు. 12వ వేతన సవరణ సంఘం ఏర్పాటు, జీవో 117 రద్దు, డీఎస్సీ తదితర అంశాలపై చేపట్టే నిరసనలో ఉపాధ్యాయులు పెద్దఎత్తున పాల్గొనాలని కోరారు. జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మణిగండన్, మునీర్, చెంగల్రాయమందడి, గంటా మోహన్, రమణ, మధుసూదన్‌రెడ్డి, ముక్తార్, బాషా, దామోదరం తదితరులు పాల్గొన్నారు.

మనస్తాపంతో వివాహిత ఆత్మహత్య

చిత్తూరు రూరల్, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): మనస్తాపంతో ఓ వివాహిత మంగళవారం ఆత్మహత్య చేసుకుంది. తాలూకా పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. ఏనుగుంటపల్లె దళితవాడలో ఉమ కుటుంబం నివాసం ఉంటోంది. ఆమె ఇంటికి సుజాత అనే మహిళ వచ్చి తన భర్త ఫోన్లో ఉమ నెంబరు ఉండటంపై నిలదీసింది. మనస్తాపానికి గురైన ఉమ ఇంట్లోనే చీరతో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకుంది. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

17 మందికి జరిమానా

చిత్తూరు (గాంధీసర్కిల్), ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): నగరంలో మద్యం తాగి వాహనాలు నడిపిన 17 మందికి ఒక్కొక్కరికి రూ.10వేల వంతున రూ.1.70 లక్షల జరిమానా విధించినట్లు ట్రాఫిక్ సీఐ నిత్యబాబు మంగళవారం తెలిపారు. ఈ ఏడాదిలో ఇప్పటిదాకా 868 మంది మద్యం తాగి వాహనాలు నడుపుతుండగా వారిని న్యాయస్థానంలో హాజరుపరిచి రూ. 86.80లక్షల జరిమానా విధించినట్లు పేర్కొన్నారు.

కోదండ రామాలయంలో
ధ్వజస్తంభానికి ఇత్తడి తాపడం



సోమల, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): సోమల మండలం ఇరికిపెంటలో కొలువుదీరిన కోదండరామస్వామి ఆలయంలోని ధ్వజస్తంభానికి దాతలు నూతనంగా ఇత్తడి తాపడం చేయించారు. అతి పురాతన ధ్వజస్తంభం శిథిలావస్థకు చేరుకోవడంతో ఇరికిపెంటకు చెందిన ఏటుకూరి రెడ్డెప్ప నాయుడు, రాజేశ్వరి కుటుంబసభ్యులు రూ.1.50 లక్షలు విలువ చేసే ఇత్తడి తాపడం చేయించారు. దాతలను ఆలయ ధర్మకర్త కోటీశ్వరరావు, మాజీ సర్పంచి శ్రీనివాసులు నాయుడు, చెన్నపట్నం చెరువు సాగునీటి సంఘం అధ్యక్షుడు బోస్ తదితరులు సన్మానించారు.

టెన్త్ విద్యార్థులకు
7 నుంచి ఫౌండేషన్ తరగతులు

పుంగనూరు రూరల్, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): పుంగనూరు బీఆర్ ప్రభుత్వ జూనియర్ కాలేజీలో ఈనెల 7వ తేదీ నుంచి 10వ తరగతి పరీక్షలు రాసిన విద్యార్థులకు ఫౌండేషన్ తరగతులు నిర్వహించనున్నట్లు ప్రిన్సిపాల్ దయానందరాజు తెలిపారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు ఉదయం 9గంటల నుంచి సాయంత్రం 5గంటల వరకు తరగతులు నిర్వహించనున్నట్లు చెప్పారు. అలాగే రెండవ సంవత్సరం ఇంటర్మీడియట్ విద్యార్థులకు మంగళవారం నుంచి తరగతులు ప్రారంభమయ్యాయన్నారు. కాలేజీకి వచ్చే విద్యార్థులకు ఉచిత మధ్యాహ్న భోజనం, టెక్స్ట్ బుక్స్, నోట్ బుక్స్, నెట్ బుక్స్, బ్యాగుతో కూడిన కిట్స్ ప్రభుత్వం ఉచితంగా అందిస్తుందని చెప్పారు. సైన్స్, ఒకేషనల్ విద్యార్థులకు రికార్డులు ఇస్తామని, ఈ అవకాశాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

11 మంది కోడిపందెంరాయుళ్ల అరెస్టు

- నలుగురు పరారీ, రూ.20,500 స్వాధీనం

బంగారుపాళ్యం, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): కోడిపందేల స్థావరాలపై పోలీసులు దాడులు చేసి 11 మందిని అరెస్టు చేశారు. వారి వద్ద నుంచి రూ.20,500తోపాటు రెండు పందెం కోళ్లను స్వాధీనం చేసుకున్నారు. సీఐ కత్తి శ్రీనివాసులు మంగళవారం మీడియాకు వివరాలు తెలిపారు. ఎగువ కంతలచెరువు పంచాయతీ లక్ష్మీపురం గ్రామ సమీపంలో కోడిపందేలు ఆడుతున్నారన్న సమాచారం రావడంతో పోలీసులు దాడులు చేశారు. 11 మందిని అరెస్టు చేయగా.. నలుగురు పరారయ్యారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

రోడ్డు పక్కన శవమయ్యాడు?



వెదురుకుప్పం, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): వెదురుకుప్పం మండల కేంద్రంలో ఓ వ్యక్తి శవమై మంగళవారం కనిపించాడు. తొలుత గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం అని భావించారు. ఆ ఫొటో వాట్సాప్ గ్రూపుల్లో వైరల్ కావడంతో కార్వేటినగరానికి చెందిన వ్యక్తి అని వారి బంధువులు మృతదేహాన్ని తీసుకెళ్లారని స్థానికులు తెలిపారు. అతడి మృతికి కారణాలు తెలియరాలేదు.

టీడీపీ ఫ్లెక్సీలో ఫొటోలు కత్తిరించేశారు

- పోలీసులకు ఫిర్యాదు చేసిన నాయకులు



శ్రీరంగరాజపురం, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): ఎస్ఆర్‌పురం ఏఎంసీ చైర్‌పర్సన్‌గా జయంతి ఎన్నికైన సందర్భంగా ఉగాది, రంజాన్ శుభాకాంక్షలు తెలుపుతూ టీడీపీ నాయకులు పుల్లూరు క్రాస్ రోడ్డులో ఫ్లెక్సీ ఏర్పాటు చేశారు. ఈ ఫ్లెక్సీ ఫొటోలను సోమవారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు కత్తిరించేశారు. ఈ పనిచేసిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని టీడీపీ మండల ఎస్సీ సెల్ అధ్యక్షుడు వెంకటాచలం, మాజీ సర్పంచ్ మణి, టీడీపీ యువ నాయకుడు గజేంద్రలు ఎస్ఐ సుమన్‌కు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

టీడీపీ ఫ్లెక్సీలో ఫొటోలు కత్తిరించేశారు

● పోలీసులకు ఫిర్యాదు చేసిన నాయకులు



శ్రీరంగరాజపురం, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): ఎస్ఆర్‌పురం ఏఎంసీ చైర్‌పర్సన్‌గా జయంతి ఎన్నికైన సందర్భంగా ఉగాది, రంజాన్ శుభాకాంక్షలు తెలుపుతూ టీడీపీ నాయకులు పుల్లూరు క్రాస్ రోడ్డులో ఫ్లెక్సీ ఏర్పాటు చేశారు. ఈ ఫ్లెక్సీ ఫొటోలను సోమవారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు కత్తిరించేశారు. ఈ పనిచేసిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని టీడీపీ మండల ఎస్సీ సెల్ అధ్యక్షుడు వెంకటాచలం, మాజీ సర్పంచ్ మణి, టీడీపీ యువ నాయకుడు గజేంద్రలు ఎస్ఐ సుమన్‌కు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

కంటైనర్ బోల్తా: డ్రైవర్‌కి స్వల్ప గాయాలు



ధ్వంసమైన కంటైనర్ క్యాబిన్ - గాయపడ్డ డ్రైవర్ గోపికన్నన్

చిత్తూరు అర్బన్, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): లారీని తప్పించపోయి ఓ కంటైనర్ బోల్తా పడింది. ఈ ప్రమాదంలో డ్రైవర్‌కు స్వల్ప గాయాలయ్యాయి. ట్రాఫిక్ పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. ఎక్స్‌కవేటర్ల స్పేర్‌పార్ట్స్ లోడుతో బెంగళూరు నుంచి చెన్నైకి కంటైనర్ బయల్దేరింది. మంగళవారం బైపా‌స్‌రోడ్డు దిగి ఇరువారం వద్ద వస్తుండగా చిత్తూరు నుంచి గుడియాత్తంకు వెళుతున్న లారీని తప్పించబోయి కంటైనర్ బోల్తా కొట్టింది. ఈ ప్రమాదంలో తమిళనాడు రాష్ట్రం తేని జిల్లాకు చెందిన కంటైనర్ డ్రైవర్ గోపికన్నన్‌కు స్వల్పగాయాలయ్యాయి. ఆ సమయంలో ఎదురుగా జనం లేకపోవడంతో పెద్ద ప్రమాదం తప్పిందని పోలీసులు తెలిపారు.

11 మంది కోడిపందెంరాయుళ్ల అరెస్టు

● నలుగురు పరారీ, రూ.20,500 స్వాధీనం



బంగారుపాళ్యం, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): కోడిపందేల స్థావరాలపై పోలీసులు దాడులు చేసి 11 మందిని అరెస్టు చేశారు. వారి వద్ద నుంచి రూ.20,500తోపాటు రెండు పందెం కోళ్లను స్వాధీనం చేసుకున్నారు. సీఐ కత్తి శ్రీనివాసులు మంగళవారం మీడియాకు వివరాలు తెలిపారు. ఎగువ కంతలచెరువు పంచాయతీ లక్ష్మీపురం గ్రామ సమీపంలో కోడిపందేలు ఆడుతున్నారన్న సమాచారం రావడంతో పోలీసులు దాడులు చేశారు. 11 మందిని అరెస్టు చేయగా.. నలుగురు పరారయ్యారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

రోడ్డు పక్కన శవమయ్యాడు?



వెదురుకుప్పం, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): వెదురుకుప్పం మండల కేంద్రంలో ఓ వ్యక్తి శవమై మంగళవారం కనిపించాడు. తొలుత గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం అని భావించారు. ఆ ఫొటో వాట్సాప్ గ్రూపుల్లో వైరల్ కావడంతో కార్వేటినగరానికి చెందిన వ్యక్తి అని వారి బంధువులు మృతదేహాన్ని తీసుకెళ్లారని స్థానికులు తెలిపారు. అతడి మృతికి కారణాలు తెలియరాలేదు.

మనస్తాపంతో వివాహిత ఆత్మహత్య

చిత్తూరు రూరల్, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): మనస్తాపంతో ఓ వివాహిత మంగళవారం ఆత్మహత్య చేసుకుంది. తాలూకా పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. ఏనుగుంటపల్లె దళితవాడలో ఉమ కుటుంబం నివాసం ఉంటోంది. ఆమె ఇంటికి సుజాత అనే మహిళ వచ్చి తన భర్త ఫోన్లో ఉమ నెంబరు ఉండటంపై నిలదీసింది. మనస్తాపానికి గురైన ఉమ ఇంట్లోనే చీరతో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకుంది. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

ఇంట్లో చోరీపై కేసు నమోదు

చిత్తూరు అర్బన్, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): ఇంట్లో జరిగిన చోరీపై తాలూకా పోలీసులు కేసు నమోదు చేశారు. ఎస్ఐ మల్లికార్జున తెలిపిన వివరాల మేరకు.. అనుప్పల్లె హౌసింగ్‌కాలనీకి చెందిన రఫీ ఆటో నడుపుకుని జీవిస్తున్నాడు. భార్య, కుమార్తెతో కలిసి ఈనెల 29వ తేదీన సాయంత్రం రంజాన్ పండుగకు గిరింపేటలో ఉన్న అత్తవారింటికి వెళ్లాడు. తిరిగి మంగళవారం మధ్యాహ్నం ఇంటికొచ్చాడు. ఇంటి తాళాన్ని పగులగొట్టి బీరువాలో ఉన్న 8 గ్రాముల బంగారం, 400 గ్రాముల వెండి వస్తువులను ఎత్తుకెళ్లిపోయినట్లు గుర్తించాడు. బాధితుడి ఫిర్యాదుతో కేసు నమోదు చేశారు.

ఇద్దరు సారా విక్రేతల అరెస్ట్



పోలీసుల అదుపులో నిందితులు

వేలూరు, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): తమిళనాడు రాష్ట్రం వేలూరు జిల్లా గుడియత్తంలో సారా విక్రయిస్తున్న ఇద్దరిని పోలీసులు అరెస్టు చేశారు. జిల్లా ఎస్పీ మదివానన్ నేతృత్వంలోని పోలీసు బృందం చిత్తూరుకు చెందిన విజయ్‌కుమార్ (46), సుధాకర్ (26)లను అదుపులోకి తీసుకున్నారు. చిత్తూరు నుంచి తీసుకొచ్చిన సారాను కళాశాల విద్యార్థులకు విక్రయిస్తున్నట్లు విచారణలో తేలింది. వీరిపై కేసు నమోదు చేసి మూడు లీటర్ల సారా, ద్విచక్ర వాహనాన్ని పోలీసులు స్వాధీనం చేశారు.

సమయపాలన పాటించాలి: డీసీహెచ్‌ఎస్



కార్వేటినగరం సీహెచ్‌ఎస్‌లో డీసీహెచ్‌ఎస్ ప్రభావతి

వెదురుకుప్పం, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): విధి నిర్వహణలో సమయపాలన పాటించాలని సిబ్బందిని డీసీహెచ్‌ఎస్ డాక్టర్ ప్రభావతి ఆదేశించారు. మంగళవారం కార్వేటినగం సీహెచ్‌సీని ఆమె తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించి, సిబ్బందికి సూచనలిచ్చారు. డాక్టర్ గోపినాథ్, సిబ్బంది పాల్గొన్నారు.

డీవైఈవోకు 'ఫ్యాప్టో' నివాళి

చిత్తూరు సెంట్రల్, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): అనారోగ్యంతో మృతి చెందిన చిత్తూరు డీవైఈవో చంద్రశేఖర్ చిత్రపటానికి పూలమాల వేసి, 'ఫ్యాప్టో' నాయకులు నివాళి అర్పించారు. మంగళవారం ఎన్జీవో కార్యాలయంలో ఈ కార్యక్రమం జరిగింది. అంతకుముందు బుధవారం కలెక్టరేట్ ముందు చేపట్టే నిరసన కార్యక్రమంపై సమావేశం నిర్వహించారు. 12వ వేతన సవరణ సంఘం ఏర్పాటు, జీవో 117 రద్దు, డీఎస్సీ తదితర అంశాలపై చేపట్టే నిరసనలో ఉపాధ్యాయులు పెద్దఎత్తున పాల్గొనాలని కోరారు. ఈ కార్యక్రమాల్లో జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మణిగండన్, మునీర్, చెంగల్రాయమందడి, గంటా మోహన్, రమణ, మధుసూదన్‌రెడ్డి, ముక్తార్, బాషా, దామోదరం తదితరులు పాల్గొన్నారు.



చంద్రశేఖర్ చిత్రపటం వద్ద నివాళి అర్పిస్తున్న ఫ్యాప్టో నాయకులు

వెలుగు కార్యాలయంలో
నేడు పీజీఆర్ఎస్

వెదురుకుప్పం, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): కార్వేటినగరం వెలుగు కార్యాలయంలో బుధవారం ఉదయం 10.30 గంటలకు ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్) కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే డాక్టర్ వీఎం థామస్ హాజరుకానున్నారు. ప్రజలు తమ సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకొచ్చి పరిష్కరించుకోవచ్చు. అలాగే ఇదే మండలంలోని కొల్లాగుంటలో ఉదయం 9.30 గంటలకు సీఎం చిత్రపటానికి జరిగే పాలాభిషేకానికి, 10గంటలకు ఎంపీడీవో కార్యాలయంలో జరిగే కుట్టు మిషన్ శిక్షణ కార్యక్రమ ప్రారంభోత్సవానికి ఎమ్మెల్యే హాజరుకానున్నారు.



గతేడాది అక్టోబరులో జోడిచింతల వద్ద అంతర్రాష్ట్ర రహదారి దుస్థితి - మరమ్మతుల తర్వాత బాగుపడిన రోడ్డు

గుంతలమయమైన రోడ్లకు మోక్షం

యాదమరి, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రహదారులకు ఎట్టకేలకు మోక్షం కలిగింది. ఐదేళ్లుగా మండల పరిధిలోని అంతర్రాష్ట్ర రహదారితోపాటు గ్రామీణరోడ్లు గుంతలతో నిండిపోయిన విషయం తెలిసిందే. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు టీడీపీ ఎమ్మెల్యే మురళీమోహన్ చొరవతో కలెక్టర్ సుమిత్‌కుమార్ జోడిచింతల కన్నికాపురం రహదారికి రూ.7కోట్లు, మిగతా గ్రామీణ ప్రాంతాల్లోని రహదారుల మరమ్మతులకు అవసరమైన నిధులు కేటాయించారు. ఏడాదిలోనే ఈ రహదారుల రూపురేఖలు మారిపోయాయి. రోడ్లన్నీ బాగుపడుతుండటంపై స్థానికులు, ప్రయాణికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

పశువులకు నీటి తొట్టెలు

నిర్మాణానికి భూమి పూజ చేసిన ఎమ్మెల్యే థామస్



సురేంద్రనగరం కాలనీలో జరిగిన భూమి పూజలో పాల్గొన్న ఎమ్మెల్యే థామస్

వెదురుకుప్పం, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): కార్వేటినగరం మండలం సురేంద్రనగరం కాలనీలో పశువులకు అవసరమైన నీటి తొట్టెల నిర్మాణానికి ఎమ్మెల్యే థామస్ మంగళవారం భూమి పూజ చేశారు. ఏపీ మాల వెల్ఫేర్ కో-ఆపరేటివ్ ఫైనాన్స్ కార్పొరేషన్ డైరెక్టర్ డాక్టర్ యుగంధర్ పొన్న, పార్టీ శ్రేణులు, అధికారులు పాల్గొన్నారు.

పాలసముద్రం: నరసింహాపురం పంచాయతీ టీవీఎన్ఆర్‌పురంలో నీటితొట్టెల నిర్మాణానికి సర్పంచ్ అమరావతి భూమిపూజ చేశారు. మండలంలో 33 నీటి తొట్టెల నిర్మాణం కోసం పశు వైద్యాధికారి యశశ్రీ ప్రతిపాదనలు పంపగా కలెక్టర్ 22 మంజూరు చేశారని ఏపీవో మార్గరేట్ తెలిపారు. టీడీపీ నాయకులు శేఖర్‌రాజు, అరుణ్‌నాథన్, తంగరాజ్, దాము, మోహన్, రమేష్ పాల్గొన్నారు.

బంగారుపాళ్యం: కల్లూరుపల్లె పంచాయతీ చిన్నకొరివారిపల్లెలో నీటి తొట్టెల నిర్మాణానికి గ్రామస్థులతో కలిసి మండల టీడీపీ క్లస్టర్ ఇన్‌చార్జి ఎన్పీ ధరణీ ప్రసాద్ భూమి పూజ చేశారు. 41 పంచాయతీల్లో 82 నీటి తొట్టెలు ఏర్పాటు చేయనున్నారని తెలిపారు. టీడీపీ నాయకులు మహేంద్ర, కుప్పాలపల్లె మురళి, జనార్దన గౌడ్, భారతి, లోకేష్‌రెడ్డి, శివ, రమేష్, హరిప్రసాద్, రవి,ఎంపీడీవో శ్రీధర్ పాల్గొన్నారు.

గుడిపాల: వెంగమాంబపురంలో నీటి తొట్టెలకు భూమి పూజ చేశారు. మండలానికి 30 నీటితొట్టెలు మంజూరయ్యాని టీడీపీ మండల అధ్యక్షుడు సుబ్రహ్మణ్యం నాయుడు తెలిపారు. ఏపీడీ సుబ్రహ్మణ్యం, తెలుగు యువత అధికార రాష్ట్ర ప్రతినిధి హేమాద్రి నాయుడు, ఫీల్డ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

పీహెచ్‌సీలో తనిఖీలు



పీహెచ్‌సీలో రికార్డులను పరిశీలిస్తున్న వెంకటప్రసాద్

పాలసముద్రం, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): పాలసముద్రం పీహెచ్‌సీని జిల్లా లెప్రసీ, టీబీ కంట్రోల్ ప్రోగామ్ అధికారి డాక్టర్ వెంకటప్రసాద్ మంగళవారం తనిఖీ చేశారు. మండలంలో ఉన్న లెప్రసీ, టీబీ రోగులకు ప్రత్యేకంగా చికిత్స అందించి, సక్రమంగా మందులు పంపిణీ చేయాలని వైద్య సిబ్బందికి సూచించారు. రికార్డులను, మందుల నిల్వలను పరిశీలించి సూచనలు ఇచ్చారు. డాక్టర్ మోహన్‌కృష్ణ, సీహెచ్‌వో జ్ఞానశేఖర్, సూపర్‌వైజర్ మురళి, ఏఎన్ఎంలు పాల్గొన్నారు.

క్రీడల్లోనూ యువత రాణించాలి



విజేతలకు ట్రోఫీ అందజేస్తున్న యువరాజారెడ్డి

గంగాధరనెల్లూరు, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): విద్యతో పాటు క్రీడల్లోనూ యువత రాణించాలని టీడీపీ యువనేత, సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ వర్రా యువరాజారెడ్డి పిలుపునిచ్చారు. ఉగాది ప్రీమియర్ లీగ్‌లో భాగంగా బాలగంగనపల్లె పంచాయతీ మేనాటంపల్లె వద్ద నాలుగురోజులపాటు క్రికెట్ టోర్నీ జరిగింది. విన్నర్స్‌గా బాలగంగనపల్లె జట్టు, రన్నర్స్‌గా ఆవలకండ్రిగ జట్టు నిలవడంతో మంగళవారం ఆయన ట్రోఫీలను అందజేశారు. టోర్నీ నిర్వాహకులు నోమేష్ రెడ్డి, యశ్వంత్‌రెడ్డి, యోగేష్‌రెడ్డి, గోపిరెడ్డి, వేణురెడ్డి పాల్గొన్నారు.

ఆలయ సిబ్బందికి దుస్తుల పంపిణీ



సిబ్బందికి దుస్తులు అందజేస్తున్న శివగామినాథన్

గంగాధరనెల్లూరు, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): ఉగాదిని పురస్కరించుకుని వేపంజేరి లక్ష్మీనారాయణుల ఆలయ సిబ్బందికి తమిళనాడు రాష్ట్రం కాంచీపురం పాటాల్ మక్కల్ కచ్చి వ్యవసాయసంఘం అధ్యక్షుడు శివగామినాథన్ మంగళవారం దుస్తులు పంపిణీ చేశారు. మేనేజర్, నలుగురు అర్చకులు, 23 మంది మహిళలు, పురుషులకు పంచెలు, టవళ్లు, చీరలు, జాకెట్ పీస్‌లను అందజేశారు. ఆయన మాట్లాడుతూ.. ఇక్కడి గోశాలకు ఏడాదికి నాలుగైదు ట్రాక్టర్లకు పైబడి వరిగడ్డిని సరఫరా చేస్తున్నామని చెప్పారు. ఇలా.. పదేళ్లుగా ఉచితంగా అందజేస్తున్నానని తెలిపారు. ఆలయ మేనేజర్ నల్లా వెంకటేశులురెడ్డి, అర్చకులు విష్ణుస్వామి, గోవిందస్వామి, ద్వివేది, గౌరీష్, సిబ్బంది పాల్గొన్నారు.

ఈ రోడ్డును బాగు చేయండి



వీఎస్ అగ్రహారం ఈద్గా వద్ద గుంతలమయమైన రోడ్డు

ఐరాల, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): ఐరాల మండల కేంద్రానికి రెండు కిలోమీటర్ల దూరంలో ఉన్న మఠంపల్లెమిట్టకు వెళ్లే దారి పూర్తిగా గుంతలమయమైంది. ఈ మార్గం ద్వారా అరుణానగర్, మఠంపల్లెమిట్ట, వడ్డిపల్లె, నాగమవాండ్లపల్లె, నాగమవాండ్లపల్లె అరుధతివాడ, రంగమ్మచెరువు గ్రామాలకు జనం రాకపోకలు సాగిస్తుంటారు. వర్షాలు కురిశాయంటే ఈ మార్గంలో ప్రజలు వెళ్లలేకున్నారు. అరుణానగర్ నుంచి ఉన్న బీటీరోడ్డు సైతం చాలా చోట్ల దెబ్బతింది. ఇప్పటికైనా సంబంధిత అధికారులు ఈ రోడ్డును బాగు చేయాలని కోరుతున్నారు.

సుబ్రహ్మణేశ్వరుడికి అభిషేకం



ప్రత్యేక అలంకరణలో సుబ్రహ్మణ్యస్వామి, బంగారమ్మ

వెదురుకుప్పం, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): కార్వేటినగరంలో వల్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్యస్వామికి మంగళవారం ప్రత్యేక అభిషేకం నిర్వహించారు. స్వామివారిని సుందరంగా అలంకరించి.. భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు.

బంగారమ్మకు విశేష పూజలు: కార్వేటినగరంలోని గ్రామ దేవత బంగారమ్మకు మంగళవారం విశేష పూజలు నిర్వహించారు. భక్తులు అమ్మవారి ఆలయ ప్రాంగణంలో పొంగళ్లు పెట్టి, నైవేద్యం సమర్పించారు. ఏర్పాట్లను ఆలయ ధర్మకర్త కొప్పేటి ప్రసాద్ పర్యవేక్షించారు.

17 మందికి జరిమానా

చిత్తూరు (గాంధీసర్కిల్), ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): నగరంలో మద్యం తాగి వాహనాలు నడిపిన 17 మందికి ఒక్కొక్కరికి రూ.10వేల వంతున రూ.1.70 లక్షల జరిమానా విధించినట్లు ట్రాఫిక్ సీఐ నిత్యబాబు మంగళవారం తెలిపారు. ఈ ఏడాదిలో ఇప్పటిదాకా 868 మంది మద్యం తాగి వాహనాలు నడుపుతుండగా వారిని న్యాయస్థానంలో హాజరుపరిచి రూ. 86.80లక్షల జరిమానా విధించినట్లు పేర్కొన్నారు.

పట్టించుకోండి



ఎల్ఎన్‌పురం వద్ద రోడ్డుపై ఉన్న గుంత

పాలసముద్రం, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): ఎల్ఎన్‌పురం గ్రామం వద్ద చిత్తూరు-బలిజకండ్రిగ రోడ్డు పక్కన ఓ పెద్ద గుంత ఉంది. రాత్రిపూట ఈ మార్గంలో కొత్తవారు వస్తే ప్రమాదం బారిన పడుతున్నారు. మరమ్మతులు చేయాలని అధికారులకు ఎన్నిసార్లు విన్నవించినా ఫలితం లేదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇకనైనా సమస్యను పరిష్కరించాలని కోరుతున్నారు.

ప్రకృతి వ్యవసాయంపై దృష్టి సారించాలి



కల్లూరులో ప్రకృతి వ్యవసాయ పంటలను పరిశీలిస్తున్న వాసు

కల్లూరు, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): రైతులు ప్రకృతి వ్యవసాయంపై దృష్టి సారించాలని ప్రకృతి వ్యవసాయం జిల్లా ప్రాజెక్ట్ మేనేజర్ వాసు తెలిపారు. పులిచెర్ల మండలం కల్లూరులో మంగళవారం ప్రకృతి వ్యవసాయ పంటలను ఆయన పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ పాత వ్యవసాయ పద్ధతుల ద్వారా సేంద్రియ వ్యవసాయం పెరగాలని, గో ఆధారిత వ్యవసాయంపై అవగాహన ఉండాలని చెప్పారు. సేంద్రియ పద్ధతులతో పండించిన కూరగాయల వాడకంపై ప్రజలు ఆసక్తి చూపుతున్నారన్నారు. సహజసిద్ధ పంట ఉత్పత్తులకు మార్కెట్లో డిమాండ్ ఉందని, తక్కువ పెట్టుబడితో అధిక లాభాలు సాధ్యమని తెలిపారు. సిబ్బంది పాల్గొన్నారు.

రేపు ఆర్టీసీ స్థలాల లీజు కోసం సమావేశం

పలమనేరు, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): పలమనేరు ఆర్టీసీ డిపో, బంగారుపాళ్యం, చౌడేపల్లి ఆర్టీసీ బస్టాండుల వద్ద ఉన్న ఖాళీ స్థలాలను లీజుకిచ్చే అంశంపై ఈనెల 3వతేది గురువారం కాంట్రాక్టర్ల సమావేశం నిర్వహిస్తున్నట్లు డిపో మేనేజర్ టీకే స్వామి తెలిపారు. ఉదయం 11గంటలకు పలమనేరు డిపో కార్యాలయంలో సమావేశం నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ సమావేశంలో ఏయే స్థలాలు ఎంతకు లీజుకు ఇవ్వాలి, బిల్డింగ్ కండీషన్లు, అన్ని వివరాలు తెలియజేస్తామన్నారు. ఆర్టీసీకి చెందిన ఖాళీస్థలాలను 5, 10, 15 సంవత్సరాలకు లీజుకు ఇవ్వనున్నట్లు డిపో మేనేజర్ తెలిపారు. ఆసక్తి గల కాంట్రాక్టర్లు ఈ సమావేశానికి హాజరై మిగిలిన వివరాలను తెలుసుకోవాలని ఆయన కోరారు.

సమస్యలను పరిష్కరిస్తాం: థామస్

వెదురుకుప్పం, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): తన దృష్టికి వచ్చిన సమస్యలను పరిష్కరిస్తామని రాష్ట్ర ప్రభుత్వ విప్ డాక్టర్ వీఎం థామస్ అన్నారు. మంగళవారం కార్వేటినగరం మండలం సురేంద్రనగరం ఏఏడబ్ల్యూలో 'ఎన్టీఆర్ భరోసా పెన్షన్' డబ్బుల పంపిణీ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. లబ్ధిదారులకు నగదు పంపిణీ చేవారు. స్థానికులు తమకు కమ్యూనిటీ భవనం, డ్రైనేజీ కాలువలు, సిమెంటు రోడ్లు మంజూరు చేయాలని థామస్ దృష్టికి తీసుకెళ్లగా.. మంజూరుకు కృషి చేస్తామని హామీ ఇచ్చారు. తహసీల్దార్ నాగరాజు, ఎంపీడీవో చంద్రమౌళి, వీఆర్వో తేజ, ఏపీ మాల వెల్ఫేర్ కో-ఆపరేటివ్ ఫైనాన్స్ కార్పొరేషన్ డైరెక్టర్ యుగంధర్ పొన్న, వన్నియకుల క్షత్రియ కార్పొరేషన్ డైరెక్టర్ రాజేంద్రరెడ్డి, టీడీపీ కార్వేటినగరం మండల అధ్యక్షుడు చెంగల్రాయయాదవ్, తెలుగు యువత మండల అధ్యక్షుడు మురళీమోహన్, తెలుగు యువత నియోజకవర్గ ఉపాధ్యక్షుడు బోడిరెడ్డి సుధాకర్‌రెడ్డి, నేతలు ఢిల్లీబాబురెడ్డి, రాధాకృష్ణయాదవ్, సోమశేఖర్‌యాదవ్, తిరుమలనాథ్, రవియాదవ్, సోము, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

సంక్షిప్తంగా..

నేడు విద్యుత్ శాఖలో గ్రీవెన్స్ డే

చిత్తూరు రూరల్, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ వినియోగదారుల సమస్యలను పరిష్కారం కోసం బుధవారం విద్యుత్ శాఖ కార్యాలయంలో ప్రత్యేక గ్రీవెన్స్ డే నిర్వహిస్తున్నట్లు చిత్తూరు ఆపరేషన్ డివిజన్ ఈఈ మునిచంద్ర ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు వినియోగదారుల నుంచి వినతులు స్వీకరిస్తామన్నారు. ఈ అవకాశాన్ని చిత్తూరు, పూతలపట్టు నియోజకవర్గం విద్యుత్ వినియోగదారులు, రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

అంగన్వాడీ కేంద్రంలో తనిఖీలు

విజయపురం, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): కేశవపురంలో అంగన్వాడీ కేంద్రాన్ని సూపర్‌వైజర్ లక్ష్మి మంగళవారం తనిఖీ చేశారు. కేంద్రంపై ఫిర్యాదు రావడంతో ఆమె విచారణ నిర్వహించారు. ఇక్కడ ఏడుగురు పిల్లలుంటే ముగ్గురు హాజరయ్యారని, కేంద్రాన్ని సక్రమంగా నిర్వహించాలని ఆదేశించారు. టీడీపీ నాయకులు సుబ్రహ్మణ్యంరాజు, కొండూరు ధాము, అంగన్వాడీ కార్యకర్త సరస తదితరులు పాల్గొన్నారు.

చేతిపంపు బోర్లకు మరమ్మతులు

విజయపురం, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): పన్నూరు దళితవాడలో చేతిపంపు బోర్లు, పైప్‌లైన్ మరమ్మతులను సర్పంచ్ కుమార్ మంగళవారం చేయించారు. వేసవి దృష్ట్యా గ్రామంలో తాగునీటి ఎద్దడి రాకుండా ముందస్తుగా ఈ పనులు చేశారు.

6నుంచి శ్రీరామనవమి ఉత్సవాలు

గుడిపాల, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కోలావూరులో ఈనెల 6వ తేదీ నుంచి శ్రీరామనవమి ఉత్సవాలు జరుగుతాయని నిర్వాహకులు తెలిపారు. చుట్టుపక్కల గ్రామస్తులు తరలిరావాలని కోరారు.

శక్తియాప్‌పై అవగాహన

చిత్తూరు అర్బన్, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): విజ్ఞాన సుధా డిగ్రీ కళాశాలలో మంగళవారం శక్తి యాప్‌పై విద్యార్థినులకు అవగాహన సమావేశాన్ని నిర్వహించారు. ఏఎస్పీ రాజశేఖర్‌రాజు పర్యవేక్షణలో మహిళా డీఎస్పీ విజయశేఖర్ హాజరై మహిళల భద్రత కోసం ఈ యాప్ ప్రవేశపెట్టారని తెలిపారు. కళాశాల చైర్మన్ శ్రీధర్, మహిళా ఎస్ఐ నాగసౌజన్య, కాలేజీ సిబ్బంది పాల్గొన్నారు.

7నుంచి ఇంటర్ ఫస్టియర్ అడ్మిషన్లు ప్రారంభం

యాదమరి, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): కె.గొల్లపల్లె ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో ఇంటర్మీడియట్ ఫస్టియర్ అడ్మిషన్లను ఈనెల ఏడో తేదీ నుంచి ప్రారంభించనున్నట్లు ప్రిన్సిపాల్ లలిత తెలిపారు. మంగళవారం సిబ్బంది కనకాచారి, మదన్మోహన్, భాస్కర్ రెడ్డి, రాజేశ్వరి, సుధాకర్, మహేష్‌లతో కలిసి వివరాలు తెలిపారు. ఎంబైపీసీ కోర్సు ఉందని, పాఠ్యపుస్తకాలు, మెటీరియల్స్‌ను ఉచితంగా అందజేస్తారని చెప్పారు.

పూతలపట్టు: ప్రభుత్వ జూనియర్ కళాశాలలోనూ ఈనెల ఏడో తేదీనుంచి ఇంటర్మీడియట్ ఫస్టియర్ అడ్మిషన్లు ప్రారంభించనున్నట్లు ప్రిన్సిపాల్ రమేష్ ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపీసీ, బైపీసీ, సీఈసీలతోపాటు ఏపీసెట్, నీట్‌లకు కోచింగ్ ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు.

నేడు ప్రజాదర్బార్

చిత్తూరు సిటీ, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): లక్ష్మీనగర్ కాలనీలోని చిత్తూరు ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్ కార్యాలయంలో బుధవారం ప్రజాదర్బార్ నిర్వహించనున్నారు. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు ప్రజల నుంచి వినతులు స్వీకరిస్తారు. ● కొంగారెడ్డిపల్లెలోని లక్ష్మీనగర్ కాలనీలోని పూతలపట్టు ఎమ్మెల్యే మురళీ మోహన్ కార్యాలయంలోనూ ప్రజా దర్బార్ జరగనుంది. మధ్యాహ్నం 2 గంటల వరకు అర్జీలు స్వీకరిస్తారు. పూతలపట్టు నియోజకవర్గ ప్రజలు సద్వినియోగం చేసుకోవచ్చు.

బాధితురాలికి ఆర్థికసాయం

చిత్తూరు అర్బన్, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): అనారోగ్యంతో మృతి చెందిన హెడ్ కానిస్టేబుల్ భార్య శివానికి పోలీసుశాఖ ఆర్థిక సాయం చేసింది. గత నెల 31వ తేదీన కానిస్టేబుల్ కుబేంద్ర అనారోగ్యంతో మరణించారు. ఎస్పీ మణికంఠ ఆదేశాలతో పోలీసు శాఖ తరఫున ఫ్లాగ్ ఫండ్ కింద రూ.25వేలు, విడో ఫండ్ కింద రూ.50వేలు, అంత్యక్రియల కోసం రూ.25వేల చొప్పున రూ.లక్షను శివానికి జిల్లా పోలీసు అసోసియేషన్ అధ్యక్షుడు ఉదయ్‌కుమార్, అధికారులు అందించారు.